సాంగ్లి వ్యవసాయ మార్కెట్ సందర్శన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



పసుపును పరిశీలిస్తున్న కమిటీ బృందం

మహారాష్ట్రలోని సాంగ్లీ వ్యవసాయ మార్కెట్‌ను నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, వైస్ చైర్మన్ జంగిటీ రామచందర్, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు గురువారం సందర్శించారు. అనంతరం మార్కెట్ యార్డ్‌లో ఉన్న పసుపు కళ్లాలను పరిశీలించారు. అనంతరం అక్కడున్న అధికారులతో అనేక అంశాలపై నిజామాబాద్ చైర్మన్ ముప్ప గంగారెడ్డి చర్చించారు. మహారాష్ట్ర ఏపీఎంసి సాంగ్లీ పర్యటనలో భాగంగా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డిని సాంగ్లీ డైరెక్టర్ సంగ్రాం పాటిల్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏఎంసి మార్కెట్ ఆఫీసు సిబ్బంది, పాలకవర్గం, సాంగ్లీ పసుపు మార్కెట్ సెక్రటరీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

నిజామాబాద్-కామారెడ్డి

శుక్రవారం | ఫిబ్రవరి 07, 2025 | www.navatelangana.com

ఆదర్శ పాఠశాలను సందర్శించిన సబ్ కలెక్టర్

నవతెలంగాణ-నిజాంసాగర్



మండలంలోని ఆదర్శ పాఠశాలను బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి గురువారం సందర్శించారు. పాఠశాలలో తాత్కాలికంగా ఉన్న వంటగది కూలిపోవడంతో ఆమె పరిశీలించారు. కొత్త వంటగది నిర్మాణం కోసం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆమె అన్నారు. అనంతరం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్పెషల్ క్లాసుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి అల్పాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి బిక్షపతి, మండల విద్యాధికారి తిరుపతిరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తిమీర..
రైతులు విలవిల

◂◂ ధర లేక ఆందోళన చెందుతున్న రైతు ◂◂ ఖర్చు ఎక్కువ.. ధర తక్కువ అని ఆవేదన

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పలు గ్రామాలలో కొత్తిమీర పంటను రైతులు సుమారు 200ల ఎకరాలలో పండిస్తున్నారు. పూర్వం నుంచి కొత్తిమీర పంటను జొన్న పంటలో అంతర్ పంటగా పండించేవారు. ప్రస్తుతం కొత్తిమీర మార్కెట్‌లో రూ.30 కేజీ లభిస్తుండటంతో కొత్తిమీర సాగుచేసిన రైతు విలవిల్లాడుతున్నారు. ఒకప్పుడు కొత్తిమీర ధర రూ.200 కేజీ ఉండగా.. ప్రస్తుతం కేజీ ధర రూ.30 మాత్రమే పలుకుతోంది. పండిన పంటకు గిట్టుబాటు ధర లేక మార్కెట్‌లో దళారులు తక్కువ రేటుకే కొనుగోలు చేయడం వలన రైతులు పెట్టిన పెట్టుబడి కూడా మిగలడం లేదని ఆవేదన చెందుతున్నారు. కొత్తిమీర విక్రయించని రైతులు వాటిని ఇంకొంత కాలం వేచి ఉండి ధనియాల పంటగా మార్చుకొని మంచి గిట్టుబాటు ధర పొందేందుకు వేచి చూస్తారు. ఇదిలా

> కొత్తిమీర రైతు విలవిల్లాడుతున్నాడు. కేజీ రూ.200 వరకు ఉన్న కొత్తిమీర పంట.. ప్రస్తుతం కేజీ రూ.30 మాత్రమే ఉంది. అమాంతరంగా ధర దిగువకు పడిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొత్తిమీర ధర తగ్గడంతో కొందరు రైతులు కొంతకాలం వేచి ఉండి ధనియాల పంటగా మార్చుకుని విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా.. ధనియాల పంటను విక్రయించేందుకు ఇక్కడి ప్రాంతంలో మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పేటట్టు లేవు.



జుక్కల్ మండలంలోని పడంపల్లి గ్రామంలో కొత్తిమీర సాగు

ఉండగా.. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నచందంగా రైతులకు పండించిన ధనియాల పంటను అమ్ముకునేందుకు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో ఇక్కడి రైతులు పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు తరలించి అమ్ముకుంటున్నారు. కొంత మేరకు ఇది కష్టమే అయినా రైతులు అక్కడి మార్కెట్లకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు.

పూర్వం రైతులు పండించిన ధనియాలను ఇంటి అవసరాలకు మాత్రమే వాడుకునేవారు. ధనియాల పంటను ఎవరు కొంటారో, ఎక్కడ అమ్మాలో నాటి రైతులకు తెలియకపోవడం.. ఇక్కడ ధనియాలు కొనే వ్యాపారస్తులు లేకపోవడంతో అప్పట్లో ఆ పంటను కనీస అవసరాలకు మాత్రమే రైతులు సాగుచేసేవారు. ప్రస్తుతం ధనియాల పంట మార్కెట్‌లో క్వింటాకు రూ.7,000 నుంచి 8000 వరకు ధర లభిస్తోంది. ధనియాల పంట ఎకరాకు ఐదు నుంచి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి రావడంతో పంట వాణిజ్య పంటగా ఆరితేరింది. జుక్కల్ ప్రాంతంలో పండించిన ధనియాలను మహారాష్ట్రలోని ధర్మాబాద్, ఉద్గీర్ ప్రాంతాలకు తీసుకెళ్లి అక్కడి వ్యాపారస్తులకు ప్రస్తుతం అమ్ముకుంటున్నారు.

కోళ్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి

- కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

మహారాష్ట్ర లాతూర్ జిల్లాలో బర్డ్‌ఫ్లూ ప్రబలినందున జిల్లాలోని కోళ్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కోళ్ల రైతులకు, పశుసంవర్ధక శాఖ సిబ్బందికి కోళ్లలో వచ్చే వివిధ వ్యాధులు ముఖ్యంగా ఏవియన్ ఇన్ఫ్లుంజ్‌పై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పౌల్ట్రీ రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. మహారాష్ట్ర సరిహద్దున కామారెడ్డి జిల్లా ఉన్నందున జిల్లాలోని కోళ్ల పెంపకం దారులకు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఇలాంటి అవగాహన సదస్సులను నిర్వహించాలని అధికారులకు సూచించారు. వ్యాధి సోకక ముందు నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. చనిపోయిన కోళ్లను దూరంగా పారవేయాలని (ప్రాపర్ డిస్పోజల్) తెలిపారు. వ్యాక్సినేషన్, ఇమ్యూనిసేషన్ బూస్టర్ వాడాలని తెలిపారు. మహారాష్ట్ర నుంచి కోళ్ల రవాణా జిల్లాలోకి రాకుండా సరిహద్దున చెక్‌పోస్టుల్లో తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే మండల పశు వైద్యాధికారిని సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖాధికారి కే. సంజయ్ కుమార్, సహాయ సంచాలకులు శ్రీనివాస్, భాస్కరన్, డాక్టర్ ఆర్.దేవేందర్, పశు వైద్యులు, పారా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రాపర్టీ టాక్స్ వందశాతం వసూలు చేయాలి

ప్రాపర్టీ టాక్స్ వందశాతం వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపల్ అధికారులు, సిబ్బందితో ఆస్తి పన్ను వసూళ్లు, నీటి చార్జీలు, తాగునీటి సరఫరా, శానిటేషన్ పనులు, మొక్కలకు వాటరింగ్, భవన నిర్మాణ పనులకు అనుమతులు, ఇంజనీరింగ్ పనులు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంటిపన్ను వసూళ్లు, గత ఎరియర్స్ వసూళ్లు చేయాలని తెలిపారు. బిల్ కలెక్టర్లు డిమాండు మేరకు పన్నుల వసూళ్లు చేయాలని అన్నారు. రోజువారీ వసూళ్ల వివరాలు బిల్ కలెక్టర్ల వారీగా నివేదికలను ప్రతీ రోజు సాయంత్రం 6 గంటలకు తనకు సమర్పించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్‌లు పన్నుల వసూళ్లపై రోజువారీ బిల్ కలెక్టర్ల వారీగా సమీక్షించాలని అన్నారు. అదేవిధంగా నీటి చార్జీలు వసూలు చేయాలని తెలిపారు. పారిశుధ్య కార్యక్రమాలకు ప్రతీరోజూ ఉదయం 5 గంటలకు పారిశుధ్య సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్ క్షేత్రస్థాయిలో ఉండాలని, అటెండెన్స్ తీసుకోవాలని తెలిపారు. ఇంటింటి చెత్త సేకరణ నిర్వహించాలని తెలిపారు. శానిటరీ వర్కర్లకు గ్లౌసెస్, ఇతర వస్తువులు సమకూర్చాలని తెలిపారు. రోజువారీ నివేదికలు ఉదయం 7 గంటలకు నివేదికలు సమర్పించాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్‌లు క్షేత్ర పర్యటనలు నిర్వహించాలని పేర్కొన్నారు. మున్సిపల్ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, కొత్త ట్యాంకర్లు కొనుగోలు చేయాలని, పాత వాటికి మరమ్మతులు చేయించాలని తెలిపారు. వేసవి కాలంలో మొక్కలకు వాటరింగ్ నిర్వహించాలని అన్నారు. వివిధ దశల్లో ఉన్న ఇంజనీరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వైకుంఠధామాల నిర్వహణ, ఎనిమల్ బర్త్ సెంటర్‌ల నిర్వహణ చేపట్టాలని అన్నారు. మున్సిపల్ ఆధీనంలోని దుకాణాల సముదాయంలోని అద్దెలు వసూళ్లు చేయాలని తెలిపారు. భవన నిర్మాణాలకు సంబంధించిన ఆన్‌లైన్ అనుమతులు మంజూరు చేయాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్‌లు, ఇంజనీరింగ్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

రూ.12 కోట్ల విలువైన నిషేధిత మత్తు పదార్థాల దహనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

రూ.12 కోట్ల విలువైన నిషేధిత మత్తు పదార్థాలను దహనం చేసినట్టు నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ దిలీప్ గురువారం తెలిపారు.



వివరాలు మెయిన్‌లో..

ఎమ్మెల్సీ ఎన్నికలకు 15 నామినేషన్లు

- గ్రాడ్యుయేట్ స్థానానికి 12
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 3

నవతెలంగాణ-నిజామాబాద్



నామినేషన్ వేస్తున్న దృశ్యం

మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గురువారం 15 నామినేషన్లు దాఖలయ్యాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 12 మంది నామినేషన్ వేయగా, టీచర్స్ ఎమ్మెల్సీకి ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థుల నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి నామినేషన్లు స్వీకరించారు. గురువారం నాటికి పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు కలిపి మొత్తం 28 మంది నామినేషన్ దాఖలు చేశారు. ఇందులో 21 మంది గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి, ఏడుగురు టీచర్స్ ఎమ్మెల్సీకి నామినేషన్ వేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్లు నిధులు మంజూరు

- ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ఎస్సీ సబ్ ప్లాన్ సిఆర్ఆర్ ఫండ్స్ నుంచి నూతన సీసీ రోడ్లు, డ్రయినేజీలకు గానూ రూ.10 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖ విడుదల చేసినట్లు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిధులతో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో దాదాపు 99 గ్రామాలలో ఎస్సీ కాలనీలో రోడ్లకు మోక్షం లభించనున్నట్లు తెలియజేశారు. నియోజకవర్గంలోని నాగిరెడ్డిపేట మండలం 21 గ్రామాలకు కోటి 97 లక్షలు, ఎల్లారెడ్డి 13 గ్రామాలు కోటి 36 లక్షలు, లింగంపేట్ 13 గ్రామాలకు కోటి 31 లక్షలు, గాంధారి 14 గ్రామాలకు కోటి 40 లక్షలు, తాడ్వాయి 11 గ్రామాలకు కోటి 3 లక్షలు, సదాశివనగర్ 16 గ్రామాలకు కోటి 73 లక్షలు, రాజంపేట్ 4 గ్రామాలకు 40 లక్షలు, రామారెడ్డి 7 గ్రామాలకు 80 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అనంతరం పనులు ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు.

వేసవికి ముందే నీటి ఎద్దడి

నవతెలంగాణ-పొతంగల్




సన్నటి నీటి ధార

వేసవి ప్రారంభానికి ముందే మండలంలో నీటి ఎద్దడి మొదలైందని ప్రజలు వాపోతున్నారు. మంజీరా నది ఒడ్డున ఇలాంటి దుస్థితి రావడం శోచనీయమన్నారు. కొన్ని కాలనీలలో నీటి ఎద్దడి విపరీతంగా ఉన్నది. పాత పోతంగల్‌లో నల్లాల్లో ప్రస్తుతం నీరు తక్కువగా రావడంతో పాటు తక్కువ సమయం వస్తున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే ముందు వేసవిలో నీటి కటకట ఎలా ఉంటుందోనని ప్రజలు అంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డీవైఎఫ్ఐ వర్ని మండల కన్వీనర్‌గా సురేష్ ఎన్నిక

నవతెలంగాణ-వర్ని



భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) వర్ని మండల కన్వీనర్‌గా శ్రీనగర్ గ్రామానికి చెందిన దేవర సురేష్‌ను గురువారం ఎన్నుకున్నట్లు సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ తెలిపారు. డీవైఎఫ్ఐ యువజనులు ఎదుర్కొంటున్న ఉద్యోగ, ఉపాధి, విద్య, వైద్యం కోసం పోరాడుతుందని ఆయన అన్నారు. యువజనుల హక్కుల కోసం నిరంతరం యువజనులతో కలిసి పోరాటాలు నిర్వహిస్తానని సురేష్ పేర్కొన్నారు.

సహకార చట్టాల సవరణను కేంద్రం ఉపసంహరించుకోవాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్

నవతెలంగాణ-కంఠేశ్వర్



డైరీని ఆవిష్కరిస్తున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రాష్ట్ర సహకార సంఘాల సవరణ చట్టాన్ని రద్దు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పులను అతిక్రమిస్తూ సహకార బ్యాంకులు, సహకార సంస్థలలోని వాటాలు సభ్యులు కానీ పెట్టుబడిదారులకు అమ్మాలని ఈ చట్టాలలోని సెక్షన్లు నిర్దేసిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో చైతన్య సేద్యం 2025 రైతుల డైరీని ఆవిష్కరించారు. అనంతరం శోభన్ మాట్లాడుతూ సహకార చట్టంలో పొందుపరిచిన సహకార సూత్రాలకు భిన్నంగా ఈ చట్టాలలోని సెక్షన్లు ఉన్నాయన్నారు. ఈ చట్టం అమలైతే సహకార వ్యవస్థ ఉనికికే ప్రమాదమని, ఈ రంగం స్వయంప్రతిపత్తి కోల్పోతుందని పేర్కొన్నారు. సహకార చట్టాల ప్రకారం వాటాలు బహిరంగ మార్కెట్లో అమ్మడం, బదలాయించడం నిషేధమని ఆయన చెప్పారు. సన్న, చిన్నకారు రైతులు, చేతివృత్తిదారులు, బలహీనులకు సాధికారత కల్పిస్తున్న సహకార విధానాన్ని రక్షించేందుకు సవరించిన చట్టాలలోని సెక్షన్లను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరుతూ రాష్ట్రశాసన సభలో తీర్మానం చేయాలని కోరారు. సహకార చట్టం రాష్ట్ర పరిధిలోని అంశం అని, కేంద్ర ప్రభుత్వానికి జోక్యం చేసుకునే హక్కు లేదని అన్నారు. రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాలను సంప్రదించకుండా వారి ఆమోదం లేకుండా కేంద్రం ఏకపక్షంగా చట్టాలను తీసుకువస్తున్నదని ఆయన విమర్శించారు. పార్లమెంటు స్టాండింగ్ కమిటీలో ప్రతిపక్ష సూచనలను కూడా ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. సహకార వ్యవస్థ రాష్ట్ర ప్రభుత్వాల అధికార పరిధిలోనే ఉన్నందున ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని, ఈ రంగాన్ని కాపాడుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం.గంగాధరప్ప, పల్లపు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు టి.భూమన్న, దేవేందర్‌సింగ్, దేవుని రాజన్న, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ 10న మహా ధర్నా

- ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న ప్రజాసంఘాల జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్

ప్రజాసంఘాల ఐక్యవేదిక (సీఐటీయూ, రైతు సంఘం, వ్యకస) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10న ఇందిరాపార్క్‌లో చేపట్టే మహాధర్నాకు అసంఘటిత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌ను సవరించి మార్చిలో పెట్టబోతున్న తెలంగాణ బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యతనివ్వాలని కోరుతూ చేపట్టబోతున్న ఈ ధర్నాకు కార్మికులకు, రైతులకు, ప్రజలకు, మున్సిపల్, గ్రామపంచాయతీ, ఆశ, అంగన్వాడి, మధ్యాహ్న భోజనం కార్మికులు, ఐకేపీ, అసంఘటిత కార్మికులు ఈ మహాధర్నాకు అన్ని రకాల కార్మికులు ఇందిరాపార్క్‌కు తరలిరావాలన్నారు. మార్చిలో జరిగే బడ్జెట్లో అన్ని రకాల కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలిపారు. సంక్షేమానికి బడ్జెట్ పెట్టాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ రాష్ట్రం పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వం విధానాలపై అఖిలపక్షంతో ఢిల్లీలో ధర్నాల ద్వారా కేంద్రంపై ఒత్తిడి పెంచవచ్చునని, కానీ ఇవేమీ చేయకుండా తెలంగాణ నుంచి బిజెపికి ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది లోక్‌సభ సభ్యులు ఉన్న రాష్ట్రం పట్ల బాధ్యత రహితంగా వ్యవహరిస్తున్నారన్నారు. కాబట్టి కేంద్ర బిజెపి సర్కార్‌ను బోనులో నిలబెట్టి ప్రజాక్షేత్రంలో ఎండబెట్టడం ద్వారానే రాష్ట్రానికి నిధులు రాబట్టడం సాధ్యమవుతుందన్నారు. అందుకు రాష్ట్రంలో అందరినీ కలుపుకొని కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్లో కూడా సంక్షేమ పథకాలను తగిన విధంగా కేటాయింపులు, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక, కర్షక, పేద ప్రజలకు వ్యతిరేకంగా ఉన్నదని, కావున 10న చేపట్టబోయే నిరసనలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, అన్ని ప్రజాసంఘాలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం, వ్యకాస జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రేణుక, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కే రాజనర్సు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం : ఎస్సై

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణ కేంద్రంలోని హరిజనవాడ కాలనీలో ఎస్సై ఆంజనేయులు సీసీ కెమెరాలు గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణ కేంద్రానికి చెందిన కౌసల్యా దేవి ఫౌండేషన్ సహకారంతో కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కౌసల్యా దేవి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్ రెడ్డి, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్ఐ

సంచారజాతి కుటుంబంపై దాడి

- వీడీసీ పేరుతో ట్రాక్టర్‌తో నివాసం గృహం నేలమట్టం
- మహిళలు, చిన్నపిల్లలకు గాయాలు
- నిజామాబాద్ జిల్లా నల్లవెల్లిలో ఘటన
- పరామర్శించిన సంచార ఓడ్ కుల జిల్లా కమిటీ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఓడ్ కుల జిల్లా కమిటీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో వీడీసీ పేరుతో కొందరు సంచార ఓడ్ కులానికి చెందిన కుటుంబంపై దాడిచేసి ట్రాక్టర్‌తో ఇల్లు కూల్చివేసి భయభ్రాంతులకు గురిచేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది.

వివరాలు మెయిన్‌లో..

ప్రభుత్వానికి కృతజ్ఞత అభినందన తీర్మానం


తహసీల్దార్‌కు అభినందన తీర్మానం కాపీ అందజేత

నవతెలంగాణ-బాల్కొండ

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, కుల సర్వే 2024లో నిర్వహించారు. ఇటీవల శాసన సభ, శాసన మండలిలో తీర్మానాన్ని ఆమోదించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ గురువారం కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీధర్‌కు కృతజ్ఞత అభినందన తీర్మానాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చాట్ల నరేష్, కిషన్ గౌడ్, యునుస్, శ్రీనివాస్, షేక్ వహాబ్, గంగాధర్, ప్రవీణ్ గౌడ్, మజారుద్దీన్ , నాగేష్, అన్వర్, సతీష్, విద్యాసాగర్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

గౌడ యువసేన మండల కమిటీ ఎన్నిక


ఎన్నికైన గౌడ యువసేన మండల కమిటీ

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా గౌడ యువసేన ఆధ్వర్యంలో ఆలూర్ మండల కమిటీ ఎన్నిక గురువారం నిర్వహించారు. మండల కమిటీ అధ్యక్షులుగా అర్జున్ గౌడ్ (ఆలూర్), ఉపాధ్యక్షులుగా మనీష్ గౌడ్ (కల్లెడి) రాకేష్ గౌడ్ (దేగాం), క్యాషియర్‌గా శ్రీకాంత్ గౌడ్(మిర్దపల్లి), ప్రధాన కార్యదర్శిగా సాయికృష్ణ గౌడ్ (గుత్ప), సహాయ కార్యదర్శిగా నరేష్ గౌడ్(మచర్ల)ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు మనీష్ గౌడ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికై నిర్విరామ కృషి చేస్తానని తెలిపారు . కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు వ్యతిరేకిస్తూ రాస్తారోకో

- సీఎం, కిషన్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న జిల్లా మాల మహానాడు సభ్యులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వర్గీకరణ బిల్లును వ్యతిరేకిస్తూ గురువారం జిల్లా మాల మహానాడు, టీం ఆధ్వర్యంలో ధర్నా చౌక్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ 2024 సర్వే ప్రకారం కాకుండా 2011 ప్రకారం వర్గీకరణ చేయడం సమంజసం కాదని, ఈ బిల్లుని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమములో మాల మహానాడు రాష్ట్ర నాయకులు ఎడ్ల నాగరాజు, అంగరి ప్రదీప్, అలుక కిషన్, జిల్లా మాల మహానాడు అధ్యక్ష,కార్యదర్శులు ఆనంపల్లి ఎల్లయ్య,నాంది వినయ్ కుమార్, కోశాధికారి నీలగిరి రాజు, టీం చైర్మన్ ఉదయ్ కుమార్, కో చైర్మన్ సి. దేవదాస్, స్వామిదాస్, జిల్లా నాయకులు గోపు ప్రభాకర్,బొడ్డు నర్సింగ్,అర్గుల సురేష్,బాలయ్య, నారాయణ, బొడ్డు లక్ష్మణ్,గంగాధర్, రామచందర్ దయానంద్ సొన్కాంబ్లీ, సాయన్న, సాయిలు, తదితర జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ప్రయోగ పరీక్ష కేంద్రాల తనిఖీ


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ఇంటర్ విద్యాధికారి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో నిర్వహిస్తున్న ప్రయోగ పరీక్షల నిర్వహణను జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొదటి స్పెల్ పరీక్షలు జరుగుతున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, వాణీ ఒకేషనల్ జూనియర్ కళాశాల, సత్య ఒకేషనల్ జూనియర్ కళాశాలలను ఇంటర్ విద్య అధికారి తనిఖీ చేయగా జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలో మరో 15 కేంద్రాలను తనిఖీ చేశారు.

ఇంటర్ విద్య అధికారి రవికుమార్ మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల్లో జియో ట్యాగింగ్ చేయాలని, కెమెరాలు పని చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో నిబంధనల మేరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. బాగా చదివే విద్యార్థులకు అన్యాయం జరగవద్దనే ఉద్దేశంతో కెమెరాల ద్వారా హైదరాబాద్ నుండి కమిషనర్ పర్యవేక్షణ చేస్తున్నారని అన్నారు. ఈ తనిఖీల్లో పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజియుద్దీన్ పాల్గొన్నారు.

7 సెల్‌ఫోన్లు, రూ.30,500 స్వాధీనం

- నిర్వాహకుడితో పాటు పేకాట రాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీ ప్రియ నగర్ ప్రాంతంలోని కస్తుర్బా కాలనీలో ఒక ఇంట్లో జరుగుతున్న పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిజామాబాద్ ఇంచార్జీ సిపీ సింధుశర్మ ఆదేశాలతో నిజామాబాద్ సిసిఎస్ ఎసిపీ, ఇంచార్జీ టాస్క్ ఫోర్స్ ఎసిపి, టాస్క్ ఫోర్స్ సిఐ అంజయ్య అధ్వర్యంలో సిసిఎస్ సిబ్బంది గురువారం దాడులు నిర్వహించారు. పేకాట స్థావరం నిర్వహకుడితోపాటు ఏడుగురు పేకాట రాయుళ్ల పట్టుబడ్డారు. వారి వద్దనుంచి ఏడు సెల్ ఫోన్లు, రూ.30,500 స్వాధీనం చేసుకున్నారు. వారిని రూరల్ పోలీసులకు అప్పగించారు. పేకాట నిర్వాహకుడిపై నిజామాబాద్ నగరంలోని పలు పోలీస్ స్టేషన్‌లలో పేకాట కేసులు ఉన్నట్లు సమాచారం.

నామినేషన్ దాఖలు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి

నవతెలంగాణ-ఆర్మూర్

మెదక్ , నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అబ్బ గోని అశోక్ గౌడ్ గురువారం నామినేషన్ పత్రాలు అందించారు. కరీంనగర్ కలెక్టర్ కార్యాలయంలో ఎలక్షన్ ఆఫీసర్‌కు నామినేషన్ పత్రాలు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో బండి నారాయణ, స్వాతి రాజేశ్వర్, రాజుల కృష్ణ, ఎల్లోల్ల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు సొసైటీ మహాజన సభ


మాట్లాడుతున్న అధ్యక్షులు శ్రీనివాస్

నవతెలంగాణ-ఆర్మూర్

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద గురువారం మహాజనసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షుడు తంబూరు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ సిహెచ్ రాజేశ్వర్, డైరెక్టర్ దేగాం ప్రమోద్, నర్సారెడ్డి, రాజు, సాయా రెడ్డిలు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సీఈఓ తో ర్తి మల్లేష్, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో లైంగిక వేధింపులు నేరం

- శారీరకంగా, మానసికంగా క్షోభకు గురి కావద్దు
- జిల్లా జడ్జి జస్టిస్ కుంచాల సునీత



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి, ఇన్‌ఛార్జి సీపీ, అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో తమ సత్తా చాటుతున్నారు. అయితే, పని ప్రదేశంలో స్త్రీలపై లైంగిక వేధింపులు పెరుగుతుండటం వారి ప్రగతికి ప్రతిబంధకంగా మారుతోంది. వేధింపులు, దాడులు మహిళల్లో అభద్రతను పెంచి పోటీ ప్రపంచంలో వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తాయి. శారీరకంగా, మానసికంగా వారిని క్షోభకు గురి చేస్తున్నారని జిల్లా జడ్జి జస్టిస్ కుంచాల సునీత పేర్కొన్నారు. గురువారం నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో మహిళలు పనిచేసే చోట జరుగుతున్న లైంగిక వేధింపుల పై అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడారు. స్త్రీలపై అత్యాచారానికి పాల్పడినా, శారీరక సంబంధం పెట్టుకొమ్మని బలవంతం చేసినా, వారితో అశ్లీల పదజాలం వాడినా, అశ్లీలంగా ఎటువంటి సైగలు చేసినా, అశ్లీల చిత్రాలు తీసినా, చూపించినా, శారీరకంగా గాని మానసికంగా గాని వారిని ఎటువంటి లైంగిక ఇబ్బందులకు గురిచేసినా అవి లైంగిక వేధింపుల కిందికి వస్తాయనీ పేర్కొన్నారు. ఏదైనా ప్రభుత్వ కార్యాలయం, ప్రభుత్వరంగ సంస్థ, ప్రైవేటు సంస్థ, ప్రభుత్వ, పైవేటు కర్మాగారం, విద్యాసంస్థ, ప్రభుత్వ, ప్రైవేటు అనుబంధ సంస్థ, సొసైటీ, ట్రస్టు, ఎన్‌జీవో, సేవలందించే సంస్థ, ఆసుపత్రి లలో మహిళాపై లైంగికంగా వేధిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో లేదా షీ టీమ్, భరోసా కేంద్రాలలో ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలు పని చేసే చోట లైంగిక వేధింపులకు గురికాకుండా అందుకు సంబంధించిన పని పరిశ్రమలు లేదా కార్యాలయంలో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. పని చేసే చోట మహిళలకు లైంగిక వేధింపులకు గురి చేసినట్లయితే ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు.

మహిళకు గృహ హింస నుంచి రక్షణ...

గృహ హింస చట్టం ప్రతి మహిళకు గృహ హింస నుంచి రక్షణ కల్పిస్తుందని తెలిపారు. ఈ చట్టం స్త్రీలను వారి భర్త-భార్య సంబంధాలలో హింస నుండి మాత్రమే కాకుండా, వారు గృహ సంబంధంలో ఉన్న వ్యక్తులతో ఒకే ఇంట్లో నివసించే మహిళలను కూడా రక్షిస్తుందని అన్నారు. ఇది స్త్రీలను వివాహం ద్వారా వారి సంబంధాలలో హింస నుండి రక్షిస్తుందని, లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా మహిళలు న్యాయ సలహాలు, సూచనలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. సలహాల కోసం 15100 నంబర్ కు ఫోన్ చేసి సలహాలు సూచనలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే ప్రస్తుతం యువత సోషల్ మీడియాలో వివిధ ఛాయాచిత్రాలు వీడి యోలు భద్రంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఫోటోలు వీడియోల ద్వారా సైబర్ నేరగాళ్లు పన్నాగం వేసి మహిళలను వేధిస్తు న్నారని, వారి ఖాతా నుంచి డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు. సైబర్ నేరగాల నుండి వచ్చిన ఫోన్ కాల్స్ ఖాతా నుంచి డబ్బులు కాజేయడం జరిగితే ఎం టి ఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని వివరించారు. మైనర్ బాలికలపై అఘాయి త్యాలు పెరుగు తున్నాయని, అలా జరగకుండా తమ ఇళ్లలో గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించాలని తెలిపారు. ఈ చట్టం స్త్రీలు పని చేసే ప్రదేశాలలో వారిపై లైంగిక వేధింపులను అరికట్టడానికి, అదే సమయంలో ఈ చట్టాన్ని దుర్వినియోగ పరుస్తూ తప్పుడు ఫిర్యాదులను చేయవద్దని కోరారు.


మాట్లాడుతున్న జిల్లా జడ్జి

ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ ఏర్పాటు...

ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలలో పనిచేసే మహిళలు, పది మంది కాని అంతకంటే ఎక్కువ ఉద్యోగులు ఉన్నట్లయితే అక్కడ ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ (ఐసీసీ)ఏర్పాటు చేయాలని, ఇంటర్నల్ కమిటి సభ్యుల పేర్లు, సెల్ నెంబర్లు, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో అందరికి కనిపించే విధంగా బోర్డు ఉండాలన్నారు. అక్కడ పనిచేసే మహిళ వేధింపులకు గురి అయితే ఆ ఇంటర్నల్ కమిటీకి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కమిటి విచారణ జరిపి వారి సర్వీస్ రూల్స్ ప్రకారం చర్య తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి సీపీ సింధు శర్మ,అదనపు డీసీపీ (అడ్మిన్) బాస్వారెడ్డి,ఏసిపి రాజా వెంకటరెడ్డి, నిజామాబాదు జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్ పి. పద్మావతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కుషబ్బ ఉపాధ్యాయ, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్ బి, కంప్లైంట్ అథారిటీ చైర్ పర్సన్ నీరజ రెడ్డి,అదనపు డీ.సీ.పీ (అడ్మిన్) జి. బస్వారెడ్డి, అదనపు డీ.సీ.పీ (ఏ ఆర్) కె.రామచంద్ర రావు, నిజామాబాద్ స్పెషల్ బ్రాంచ్ ఏసిపి శ్రీనివాసరావు, సిఐలు, ఆర్ఐలు ఎస్ఐలు, ఎఆర్ఎస్ఐలు, పోలీస్ మహిళా ఉద్యోగినులు, సిపిఓ ఆఫీస్ మహిళా ఉద్యోగినులు, ఫారెస్ట్ డిపార్ట మెంటు, రెవిన్యూ డిపార్ట్మెంట్, జ్యుడీషియల్ డిపార్ట్మెంట్, వస్త్ర దుకాణాల మహిళా ఉద్యోగినులు, అంగన్వాడి, ఆశా వర్కర్స్ ,జువెలర్స్ షాప్, ఉద్యోగినులందరూ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో కుక్కలు, కోతుల బెడద

- పిక్కలు పట్టేస్తున్న కుక్కలు
- జంకుతున్న ప్రజలు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శాస్త్రినగర్‌తోపాటు మామిడిపల్లి, యోగేశ్వర కాలనీ, వెంకటేశ్వర కాలనీలో (బుధవారం 5వ తేదీ) కుక్కలు దాడి చేసిన ఘటనలో చిన్నారులకు తీవ్ర గాయాలు ఆయన ఘటన పట్టణంలో తీవ్ర కలవరం రేపింది.

జిల్లాలోని..

జిల్లాలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వాటి సంతతి రోజురోజుకు పెరుగుతుంది. ఒంటరిగా బయటికి వస్తే వెంబడిస్తున్నాయి. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్న వెనకాల నుంచి వచ్చి పిక్కలు పట్టేస్తున్నాయి. గుంపులు, గుంపులుగా సంచరిస్తూ పగలు రాత్రి తేడా లేకుండా ఆటలాడుకునే చిన్నారులు, పాదాచారులు కరుస్తున్నాయి. గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో మాంసం దుకాణాలు హోటళ్ల వద్ద వ్యర్థాల కోసం కుక్కలు గుంపులుగా ఉంటున్నాయి. గత సంవత్సరం ఆగస్టు, సెప్టెంబర్ నెలలో ఒక్క జిల్లా కేంద్రంలో 75 మంది కుక్కకాటు బారిన పడి చికిత్స పొందగా, ఒక బాలుడు సైతం మృతి చెందాడు.

గత సంవత్సర కాలం నుండి కుక్కల బెడద రోజురోజుకు తీవ్రతరమవుతుంది. గుంపులు గుంపులుగా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కనిపించిన వారి వెంట పడుతూ దాడి చేస్తున్నాయి. పలు వీధుల్లో ఇటీవల వీధి కుక్కల బెడద శృతిమించి పోతుంది. వీధులు, రహదారులపై గుంపులు గుంపులుగా తిష్ట వేస్తున్నాయి. వీధుల గుండా నడుచుకుంటూ పోయే వ్యక్తులకు వాహనదారుల వెంటపడి భయాందోళనకు గురి చేస్తున్నాయి. దీంతో ఇంట్లో నుంచి కాలు బయటపెట్టాలంటే జంకుతున్నారు.

నియోజకవర్గంలో... పట్టణంలో....

పట్టణంతో పాటు మున్సిపల్‌లో విలీనమైన మామిడిపల్లి , పెర్కిట్‌లలో కుక్కల బెడద విపరీతంగా పెరిగింది. గత సంవత్సరం ఆగస్టు నెలలో తొమ్మిదవ వార్డులో ఒక వ్యక్తిపై కుక్కలు దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డారు. పోచమ్మ కాలనీలో ఓ చిన్నారిపై కుక్కలు దాడి చేయడంతో చెవి ,చేతిపై గాయాలు కాగా, బాధిత కుటుంబ సభ్యులు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు సైతం చేశారు. సెప్టెంబర్ నెలలో సైతం ఆలూరు మండల కేంద్రంలో బయట ఆడుకుంటున్న మూడేళ్ల బాలుడితో పాటు నలుగురు మహిళలు, ఇద్దరు పురుషులపై దాడి చేయగా దేగాం పిహెచ్సి కీ తరలించి, మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రి (జిజిహెచ్)కు తరలించారు. నందిపేట మండల కేంద్రంలో పిచ్చికుక్క ఎనిమిది మందిని కాటేసింది. అదే మరుసటి రోజు కుద్వాన్‌పూర్‌లో నలుగురు , వెల్మల్ లో మరో ముగ్గురిని కరిచింది. ఆర్మూర్ మండలంలోని చేపూర్ గ్రామంలో పిచ్చికుక్క ఒకేరోజు ఆరుగురిపై దాడి చేయగా క్షతగాత్రులు ఆసుపత్రులకు పరుగులు తీశారు.

కోతులు సైతం...

పట్టణంతో పాటు విలీన గ్రామాలలోని పలు వార్డులలో కోతులు సైతం ఇళ్లల్లోకి ప్రవేశించి వస్తువులను చిందరవంతరంగా పడేస్తున్నవి .ఇలా తలుపు తీస్తే చాలు. ఇంట్లో ఉన్న తినుబండారాలు చిరుధాన్యాలు పట్టుకుపోతున్నవి. కోతులను బెదిరిస్తే తిరిగి దాడులు చేస్తున్నాయే తప్ప బయటకు వెళ్లడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇళ్లపై ఉంటూ ముప్పు తిప్పలు పెడుతున్నాయని పలు కాలనీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో..

వీధి కుక్కలను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సైతం సీరియస్‌గా పరిగణించింది .తక్షణమే వీధి కుక్కలను నియంత్రించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలతో గ్రామపంచాయతీలు, మున్సిపల్ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టగా జిల్లా కేంద్రంలోని టోల్ ఫ్రీ నెంబర్‌నుసైతం ఏర్పాటు చేశారు. కాగా టోల్ ఫ్రీ నెంబర్‌కు అధికంగా ఫిర్యాదులు రావడంతో అధికారులు అంతగా స్పందించటం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

భయానక పరిస్థితి నెలకొంది



ఎక్కడ చూసినా కుక్కల స్వైర విహారం భయాందోళనకు గురి చేస్తున్నాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వీధుల్లో నడవాలంటేనే కుక్కల సంచారం భయానక పరిస్థితిని తలపిస్తున్నాయి. సంబంధిత అధికారులు ప్రజల ప్రాణాలను కాపాడాలి.

పాలెపు రాజు, బిజెపి అసెంబ్లీ కన్వీనర్, ఆర్మూర్.

వర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో కందుకూరి వెంకటేశ్వర్లుకు డాక్టరేట్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగం పరిశోధక విద్యార్థి కందుకూరి వెంకటేశ్వర్లు డాక్టర్ వాసం చంద్రశేఖర్ అసోసియేట్ ప్రొఫెసర్ పర్యవేక్షణలో ప్రిపరేషన్"స్టడీస్ ఆన్ మీథేన్ డీకంపోజిషన్ ఓవర్ నికెల్ బేస్డ్ హెటిరోజీనెస్ కాటలిస్ట్స్ ఫర్ మాలిక్యులర్ హైడ్రోజన్ ప్రొడక్షన్." అనే అంశంపై పరిశోధన జరిపారు. గురువారం జరిగిన బహిరంగ మౌఖిక పరీక్షకు ఎక్స్టర్నల్ ఎగ్జామినల్ కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.జ్యోతి హాజరై పరిశోధన సిద్ధాంత గ్రంథంపై, హైడ్రోజన్ ఉత్పత్తిపై విస్తృతమైన ప్రశ్నలు లేవనెత్తారు. ఎక్స్టర్నల్ ఎగ్జామినర్ అడిగిన అన్ని ప్రశ్నలకు పరిశోధక విద్యార్థి ప్రయోగాత్మకమైన ఉదాహరణలతో సమాధానాలు ఇవ్వడంతో ఎక్స్టర్నల్ ఎగ్జామినర్ పరిశోధన పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యావరణానికి హాని కలిగించని హైడ్రోజన్ ఇంధనాన్ని తక్కువ ఖర్చులో ఉత్పత్తి చేయడం, ప్రస్తుత ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా హైడ్రోజన్ ఇంధన ఉపయోగాలను తన సిద్ధాంత గ్రంథంలో తెలియజేసినందుకు సంతృప్తి వ్యక్తం చేసి పీహెచ్డీ డిగ్రీ ప్రధానానికి ఆమోదం తెలిపారు. ఈ పరిశోధన ప్రయోగంలో రుజువైన ఫలితాలతో రాసిన మూడు వ్యాసాలు ప్రసిద్ధి చెందిన అంతర్జాతీయ ప్రమాణాలున్న అత్యధిక ఇంపాక్ట్ ఫ్యాక్టర్ కలిగిన జర్నల్స్ ప్రచురించడంతో మరింత గుర్తింపు వస్తుందని ఎక్స్టర్నల్ ఎగ్జామినర్ ప్రొఫెసర్ జ్యోతి పరిశోధకుడిని అభినందించారు. బహిరంగ మౌఖిక పరీక్షకు ఫార్మసిటికల్ కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ మావురపు సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ బోయపాటి శిరీష, డాక్టర్ ప్రసన్న శీల కాంటాక్ట్ అధ్యాపకులు పరిశోధక, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

- జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్



మాట్లాడుతున్న డాక్టర్ తుకారం రాథోడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 10 న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో బాగంగా ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని, సంవత్సరం పిల్లలకు పైబడిన పిల్లలకు 400 మిల్లీగ్రాముల మాత్ర వేయాలని, మొదటిరోజు తప్పిపోయిన పిల్లలకు ఈనెల 17న తిరిగి మాత్రలు వేయాలని జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ పేర్కొన్నారు. గురువారం డిచ్ పల్లి సామాజిక ఆరోగ్య కేంద్ర లో ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు చెందిన ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు జాతీయ నులిపురుగుల నివారణపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ మాట్లాడుతూ... మట్టి ద్వారా వ్యాపించే వ్యాధి కావున బహిరంగ మలవిసర్జనను బహిష్కరించాలని తెలిపారు. బహిరంగంగా మలవిసర్జన చేసినట్లయితే పాదరక్షలు లేకుండా బయట తిరిగినప్పుడు కాలు ద్వారా నులిపురుగు శరీరంలోకి ప్రవేశిస్తుందని, చిన్నపిల్లలు మట్టిలో ఆడుకున్నట్లయితే గోర్ల ద్వారా, నోటి ద్వారా శరీరంలోకి నిలుపురికి ప్రవేశిస్తుందని తద్వారా పిల్లలకు పోషకాహార లోపం రక్తహీనత లాంటి వ్యాధులు వ్యాపిస్తాయని తెలియజేశారు. పిల్లలు కచ్చితంగా చేతులు కడుక్కుని నీటిని తాగాలని, ఆహారం తినాలని, పిల్లలకు మరుగుదొడ్లు అలవాటు చేయాలని వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ సుశాంత్ రెడ్డి, డిచ్పల్లి మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఆరోగ్య బోధకురాలు స్వామి సులోచన, ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు దేవపాల, రాజేందర్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాల నాణ్యతపై టెస్ట్ చెకింగ్

- అయోడిన్ ఉప్పుపై అధికారులకు ఫిర్యాదు


పాలనాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో వివిధ రకాల పాల నాణ్యతపై టెస్ట్ చెక్ కార్యక్రమం నిజామాబాద్ విజయ డెయిరీలో గురువారం నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాలో ప్రతీ రోజు 50 వేల లీటర్ల పాలు అమ్మకం జరుగు తుంటే, అందులో 42 వేల లీటర్లు ప్రయువేట డెయిరీ లు, ఆరు వేల లీటర్లు విజయ డెయిరీ, మిగతా రెండు వేల లీటర్లు చిన్న చిన్న రైతు డెయిరీల ద్వారా అమ్మకం జరుగు తుందనిక్రమంలో పాల నాణ్యతపై విజయ డెయిరీ లాబోరేటరీలో విజయ డెయిరీ సహకారంతో టెస్ట్ చెక్ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి తెలిపారు. పాల నాణ్యతపై విజయ డెయిరీ ల్యాబరేటరీతో విజయ డెయిరీ సహకారం తో టెస్ట్ చెక్ నిర్వహిం చామన్నారు. రోజుకు 30 వేల లీటర్లు అమ్ముతున్న ప్రయివేటు పాల డెయిరీలు, తమ పాల పాకెట్లపై ముద్రించిన మాదిరిగా వెన్న శాతం తక్కువగా ఉండటం, మిగతా నాణ్యతా ప్రమా ణాలు ప్యాకెట్‌పై ముద్రించిన సమాచారం ప్రకారం లేకపోవడంను టెస్ట్ చెక్‌లో ధృవీకరిం చినట్టు తెలిపారు. విజయ డెయిరీ అధికారులు తెలిపిన ప్రకారం.. నిజామాబాద్‌లో విజయ డెయిరీకి రైతుల నుండి పాల సేకరణ కేంద్రాలు (120) ఉంటే, ప్రయివేటు డెయిరీలకు నిజామాబాద్‌లో ఒక్క పాల సేకరణ కేంద్రం లేక పోవడం గమనార్హం. అనంతరం ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి అధ్యక్ష, కార్యదర్శులు పెందోట అనిల్ కుమార్, సందు ప్రవీణ్, ఉపాధ్యక్షులు వెంకట నర్సింహ వర్మ, రాజుల రామనాథం, ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు పొడపెల్లి అనిల్ ఫుడ్ సేఫ్టీ కార్యాలయంలో అయోడిన్ ఉప్పు నాణ్యతపై అధికారులకు ఫిర్యాదును అందజేశారు.

పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎం.నరేందర్

- రాష్ట్ర సహాయ కార్యదర్శిగా డాక్టర్ కర్క గణేష్




నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పిడిఎస్యు రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ఫిబ్రవరి 4, 5 తేదీలలో భద్రాచలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగింది. ఈ జనరల్ కౌన్సిల్లో నిజామబాద్ జిల్లాకు చెందిన ఎం. నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా డాక్టర్ కర్క గణేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎస్.కే. అఫ్షర్, ఎల్. అనిల్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర జనరల్ కౌన్సిల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని నిర్మించాలని, స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల విడుదల, ప్రభుత్వ విద్యాలయాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికై, విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా విద్యా పోరాటాలు నిర్మించాలని అనేక తీర్మానాలు చేశారని తెలిపారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్



నవతెలంగాణ-కామారెడ్డి

బుద్ధిష్ట సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర శాఖ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమం లో, బుద్ధిష్ట సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు సాయం మౌర్య, రాజు, రాజన్న, రాజకుమార్, నరేందర్, జంగం శ్రీశైలం, సంజీవులు, యేసు రత్నం, కిషన్ సాయి, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

మురికి కాల్వలో నీరు నిల్వ ఉండొద్దు

- ఎంపీఓ మలహరి



నవతెలంగాణ-లింగంపేట్

మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండవద్దని ఎంపీ ఓ మలహరి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మురికి కాలువలో పూడిక పనులను ఆయన పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా చెత్తచెదారం లేకుండా చూడాలన్నారు. పారిశుధ్యం లోపించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన జీవితాన్ని పిల్లలకు అందిద్దాం

- మండల వైద్యాధికారి డాక్టర్ రోహిత్

నవతెలంగాణ-నిజాంసాగర్

ఆరోగ్యవంతమైన జీవితాన్ని పిల్లలకు అందిద్దామని నిజాంసాగర్ మండల వైద్యాధికారి రోహిత్ అన్నారు. ఫిబ్రవరి 10న నులిపురుగుల దినోత్సవ సందర్భంగా ఆయన నిజాంసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ దవఖానాలో నులిపురుగుల నిర్మూలనకు అల్బెండజోల్ మాత్రలు వేసేందుకు మండలంలోని ఆరోగ్య, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో పిల్లలు ఆరోగ్యవంతులుగా తయారైతేనే వారిలో నైపుణ్యాభివృద్ధి పెంపొందుతుందని అందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సి ఉందని అన్నారు. మండల వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 1 నుంచి 19 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారికి ఆల్బెండజోల్ మాత్రలు వేసేందుకు అధికారులు సిద్ధమయ్యారని తెలిపారు. మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఆరోగ్యశాఖ సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రలు అందించనున్నారని పేర్కొన్నారు. అంతేకాక విద్యానభ్యసించని వారికి ఆశా కార్యకర్తలు మాత్రలు అందించే విధంగా చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు.

నులి పురుగుల వల్ల అనర్థాలు...

నులిపురుగుల వల్ల పిల్లలకు అనేక అనర్థాలు కలుగుతాయని, ముఖ్యంగా 1 నుంచి 19 సంవత్సరాల వయసున్న వారిలో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపులో నొప్పి, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, వికారం, వాంతులు, మలంలో రక్తం, అతిసారంతో పాటు మరికొన్ని ఇబ్బందులు తలెత్తుతాయని మండల వైద్యాధికారి రోహిత్ తెలిపారు.

నిర్మూలన కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలు..

పిల్లల్లో మూడు రకాల పురుగులు ఉండే అవకాశం ఉందని మండల వైద్యాధికారి రోహిత్ తెలిపారు. దానిలో ఏలిక పాములు, నులి పురుగులు, కొంకి పురుగులని, వీటిని నిర్మూలించేందుకు అల్బెండజోలు మాత్రలు తీసుకోవాలన్నారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల వయసు గలవారు 200 ఎంజి మాత్ర, మిగతావారు 400ఎంజి మాత్ర వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ రోహిత్

రాంపూర్ గడ్డ మాజీ సర్పంచ్ తల్లి మృతి



నవతెలంగాణ-గాంధారి

మండలంలోని రాంపూర్ గడ్డ మాజీ సర్పంచ్ భాగ్య నాయక్ మాతృమూర్తి బుధవారం రాత్రి మృతిచెందింది. విషయం తెలుసుకున్న గాంధారి మాజీ జెడ్పి సభ్యులు హరాలే తానాజీరావు, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు రాజులు.. భాగ్య నాయక్‌ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియలో పాల్గొన్నారు. మండలంలోని వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎన్‌డీఎస్ఎల్ కార్మికుడి మృతి

నవతెలంగాణ-బోధన్

ఎన్‌డీఎస్ఎల్ ఉద్యోగి ట్రాక్టర్ విభాగం డ్రైవర్ అయిన సూరజ్ ప్రసాద్ గురువారం అనారోగ్యంతో మృతి చెందినట్లు మజ్దూర్ సభ యూనియన్ జనరల్ సెక్రటరీ ఉపేందర్ తెలిపారు. శక్కర్‌నగర్ యూనిట్‌లో ఆయన విధులు నిర్వహించారని తెలిపారు. గత పది సంవత్సరాలుగా వేతనాలు లేకపోవడంతో మనోవేదనతోనే అనారోగ్యానికి గురయ్యారని పేర్కొన్నారు. దాంతో ఆర్థిక ఇబ్బందులతో హాస్పిటల్‌లో వైద్యం చేయించుకోలేక పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు. కావున ఇవి మేనేజ్మెంట్, ప్రభుత్వం హత్యలుగానే భావించాలని ఉపేందర్ పేర్కొన్నారు. తక్షణమే మృతుని కుటుంబానికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని, ఇకనైనా ప్రభుత్వం, మేనేజ్మెంట్ స్పందించి నిజాంషుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగులకు వెంటనే వేతనాలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-రెంజల్

మండల పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న ఒక సెల్‌ఫోన్‌ను బాధితుడికి తిరిగి అప్పగించినట్టు రెంజల్ ఎస్సై ఈ.సాయన్న, కానిస్టేబుల్ గణేష్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సిఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోను అందజేసినట్టు తెలిపారు.

బీజేపీ మండలాధ్యక్షులుగా బొల్లారం క్రాంతి కుమార్



నవతెలంగాణ-లింగంపేట్

బీజేపీ మండలాధ్యక్షులుగా బొల్లారం క్రాంతి కుమార్‌ను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన నూతన అధ్యక్ష కార్యదర్శులు కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో జిల్లాలోని ఆయా మండలాల అధ్యక్షులు ఎన్నికైన ప్రకటించారు. లింగంపేట్ పట్టణానికి చెందిన యువ నాయకుడు బొల్లారం క్రాంతికుమార్‌ను లింగంపేట్ మండల అధ్యక్షుడిగా ఎన్నుకోవడంతో యువతకు ప్రాధాన్యత ఇచ్చిందని పార్టీ వర్గాలు పనితీరును భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు అభినందించారు.

108 సిబ్బందికి సామగ్రి ఫర్నీచర్ వితరణ

నవతెలంగాణ-తాడ్వాయి

నూతనంగా మండల కేంద్రానికి వచ్చిన 108 సిబ్బందికి ఫర్నీచర్, వంట సామగ్రిని వితరణగా అందించినట్లు సిబ్బంది సత్యం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు రామ గోనోల రాజా గౌడ్ అందజేశారని అత్యవసర సేవలకు అందుబాటులో ఉండే సిబ్బందికి ఇబ్బందులు కలగొద్దని ఉద్దేశంతో ఫర్నీచర్, వంట సామగ్రి అందజేసినట్లు సిబ్బంది తెలిపారు.

మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు

నవతెలంగాణ-భిక్కనూర్

మద్యం సేవించి వాహనాలు నడిపితే శాఖ పరమైన చర్యలు తప్పవని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. బుధవారం రాత్రి మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. వాహనదారులు సరైన వాహనపత్రాలు, హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు జరగకుండా పోలీసులకు సహకరించాలని అన్నారు. గురువారం సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమాను విధించినట్లు పోలీసులు తెలిపారు.

డాక్టరేట్ పట్టా పొందిన ఎం.లింగంకు సన్మానం



లింగంను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-రెంజల్

ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ ఉన్నత చదువులు చదివి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ అనేక సామాజిక సేవలో పాల్గొన్న ఎం.లింగంకు డాక్టరేట్ పట్టా రావడం అభినందనీయమని ఉషశ్రీ పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్‌గౌడ్, ప్రిన్సిపాల్ నసీరుద్దీన్‌లు పేర్కొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు, విద్యా వ్యవస్థ నిర్వహణ అనే రంగాలపై డాక్టరేట్ పట్టా రావడం అభినందనీయమని వారు స్పష్టం చేశారు. తమిళనాడ్‌లోని హెూసూర్‌లో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీలో ఎం.లింగం ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టరేట్ పట్టా పొందినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఉషశ్రీ పాఠశాలలో ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన విద్యార్థులు

నవతెలంగాణ-కామారెడ్డి(బీబీపేట్)

క్షేత్ర పర్యటనలో భాగంగా టిఎస్ఎస్ఆర్ జెడ్పిహెచ్ఎస్ బీబీపేట్ బాలుర పాఠశాల విద్యార్థులు సేంద్రియ వ్యవసాయం చేస్తున్న కుర్ల సిద్ధ రాములు పొలాన్ని గురువారం సందర్శించారు. పశువుల వ్యర్థాలు, గృహాల నుంచి వచ్చే తడి పొడి చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ జీవామృతం, పంచగవ్య వంటి సహజ ఎరువులను తయారు చేసే విధానం, ఇవి ఉపయోగించడం వల్ల అధిక దిగుబడులను పొందే విధానం గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు సిద్ధ రాములు మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వల్ల పర్యావరణ విధ్వంసం జరిగి మనుషుల ఆరోగ్యం ఆయుష్షు తగ్గిపోతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేంద్రీయ సాగు బాట పట్టి పర్యావరణాన్ని కాపాడాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వ మోహన్, నాగరాజు, సంజీవులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కిసాన్‌తాండ గ్రామంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. మూడు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమాలను బుధవారం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం విగ్రహ ప్రతిష్టాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు రాథోడ్ ధన్‌సింగ్ నాయక్, జరుప్ల నరేష్, మాలోత్ విజయ్, రాథోడ్ లాలు, మాలోత్ శంకర్, పీర్ సింగ్, మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ శిబిరం



ఫిజియోథెరపీ శిబిరంలో పాల్గొన్న వికలాంగులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ పరీక్షలను ఫిజియోథెరపిస్ట్ మనిషా నిర్వహించారు. ఫిజియోథెరపీ డాక్టర్ మనీషా పరీక్షలు నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి, చందర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మండ్లు, శిబిరం నిర్వాహకులు రాలు రూప విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాలు జరగకుండా చర్యలు చేపట్టాలి

- మెడికల్ అధికారి విజయ మహాలక్ష్మి

నవతెలంగాణ-రాజంపేట్ (భిక్కనూర్)

మాతృ మరణాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మెడికల్ అధికారి విజయ మహాలక్ష్మి వైద్య సిబ్బందికి సూచించారు. రాజంపేట్ పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అమ్మ ఒడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ అధికారి విజయ మహాలక్ష్మి గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సూచనలు సలహాలు పాటించి మందులు వాడాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకుని పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు అయ్యే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని, మాతృ, శిశుమరణాల రేటు తగ్గించడం కోసం పుట్టిన వెంటనే ముర్రుపాలతో పాటు 0 ఓపివి హైపటైటిస్ బిడిసిజి అందించడానికి వీలవుతుందని, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రభుత్వం అందించే పారితోషకాలు పొందడానికి అవకాశం ఉంటుందని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. బాల్యవివాహాల వలన మాతృ మరణం సంభవిస్తుందని, బిడ్డకు బిడ్డకు మధ్య వ్యవధి లేకపోవడం వలన మాతృ మరణం సంభవించవచ్చునని, చిన్నతనంలోనే పెళ్లిళ్ల కావడం.. ఐరన్ లోపం ఉండడం వలన మాతృ మరణాలకు దారితీస్తుందని తెలియజేశారు. ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే నులి పురుగు దినోత్సవ కార్యక్రమం గురించి వైద్య సిబ్బందికి వివరించారు. గ్రామాలలో వైద్య సేవలు, రికార్డుల నమోదు వివరాలు, వ్యాక్సినేషన్ వివరాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సంగీత, హెల్త్ సూపర్వైజర్ మంజూర్, గంగామణి, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, గర్భిణులు, వైద్య సిబ్బంది, తదితరులున్నారు.



మాట్లాడుతున్న మెడికల్ అధికారి విజయ మహాలక్ష్మి

మెనూ ప్రకారం పౌష్టికారాన్ని అందించాలి

- ఎంపీడీవో వెంకటేష్ జాదవ్



మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్

అంగన్వాడి కేంద్రాలలో మెనూ ప్రకారం చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ అంగన్వాడి టీచర్లను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పోషకాహారం అందించాలని ఆయన సూచించారు. ప్రతిరోజు పప్పు వండకుండా కూరగాయలు వండాలని ఆయన అన్నారు. అంగన్వాడి కేంద్రంలో ఎలాంటి సమస్యలున్నా స్థానిక గ్రామ కార్యదర్శికి తెలియపరచి ఆ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి రాజు, అంగన్వాడీ టీచర్ విజయ తదితరులున్నారు.

మీసేవ, ఆన్‌లైన్ సెంటర్ల అధ్యక్షునిగా సత్యనారాయణ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన సత్యనారాయణ

నవతెలంగాణ-లింగంపేట్

మీసేవ, ఆన్లైన్ సెంటర్ల అధ్యక్షునిగా సత్యనారాయణ రెడ్డిని గురువారం ఏకగ్రీవంగా అనుకున్నారు. మండల మీసేవ, ఆన్లైన్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్ల నిర్వాహకుల సమావేశాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సురాయిపల్లి గ్రామానికి చెందిన లింగంపేట మీసేవ నిర్వాహకులు సత్యనారాయణరెడ్డిని అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చిలుక శ్రీనివాస్, కోశాధికారిగా శ్రీరామ్, సలహాదారులుగా గౌతమ్, సుబ్బు, నరేష్, ప్రవీణ్, గురుప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా, సలహాదారులుగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. ప్రతినెలా సమావేశం ఏర్పాటు చేసుకోవాలని సంఘంలో డబ్బులు జమ చేయాలని యూనియన్ నిర్ణయించిన ధరలకే కట్టుబడి ఉండాలన్నారు. మీసేవ నిర్వాహకులు ఆన్లైన్ సెంటర్ల నిర్వాహకులు సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, సమావేశంలో చర్చించి పరిష్కరించుకుందామన్నారు.

బాంబే క్లాత్ హౌస్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రెస్ వితరణ



విద్యార్థులతో మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఉన్న ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కామారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న బాంబే క్లాత్ హౌస్ యజమాని లాల్ పుట్టినరోజు సందర్భంగా స్పోర్ట్స్ డ్రెస్ గురువారం వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు తన వంతు సహకారంగా స్పోర్ట్స్ డ్రెస్ వితరణ చేసినందుకు గాను ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, బాంబే క్లాత్ హౌస్ ప్రతినిధులు, గ్రామస్తులు, తదితరులున్నారు.

స్వచ్ఛగ్రామంగా తీర్చిదిద్దడానికి గ్రామస్తులు సహకరించాలి

నవతెలంగాణ-భిక్కనూర్

స్వచ్ఛగ్రామంగా తీర్చిదిద్దడానికి గ్రామస్తులు గ్రామపంచాయతీకి సహకరించాలని పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ తెలిపారు. గురువారం మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో పారిశుధ్య పనులు, మంచినీటి మరమ్మతు పనులు, వాటర్ ట్యాంకుల వద్ద ట్యాప్‌లో, వాటర్ లీకేజ్ మరమ్మతు పనులు గ్రామపంచాయతీ సిబ్బంది చేత చేపట్టారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజలు నీటిని వృథాచేయవద్దని, నీటి సమస్య ఉంటే గ్రామపంచాయతీలో తెలియజేయాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమలు వ్యాపించకుండా ఇంటి పరిసరాలలో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు మేలు



నవతెలంగాణ-జుక్కల్

ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు మేలు చేకూరుతుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి (ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ) కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సీఎల్పీ సమావేశంలో కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణపై చేపట్టిన చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ఎన్నో ఏళ్లుగా నానబెట్టి నానబెట్టి ఇవ్వకుండా మాదిగలకు మోసం చేయడం రాజకీయ నాయకుల పరిపాటిగా మారిందన్నారు. అనేక పోరాటాలు చేసినప్పటికీ ఏ ప్రభుత్వమూ స్పందించలేదని వివరించారు. ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు పలకడం హర్షనీయమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాదిగ జాతి నాయకులు ఎప్పటికీ రుణపడి ఉంటామని సమావేశంలో తెలియజేశారు.

భేటి పడావో భేటి బచావోపై ప్రతిజ్ఞ

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో భేటి పడావో భేటి బచావో కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చిన్నారులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. బాల్యవివాహాలు, అక్రమ రవాణా, రక్తహీనతపై చిన్నారులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులను గౌరవించడమే కాకుండా చదువులపై ఆసక్తిని కనబర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు, ఐసిడిఎస్ సూపర్వైజర్ సౌజన్య, డిస్ట్రిక్ మిషన్ కోఆర్డినేటర్ స్వప్న, బాబురావు, పుష్ప, అంగన్వాడి టీచర్లు సుజాత, రాజ్యలక్ష్మి పూజ, రజిత తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు మున్సిపల్ అధికారుల చర్యలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో దోమలు విపరీతంగా పెరగడంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దాంతో పట్టణ వాసులు దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించారు. దాంతో మున్సిపల్ అధికారులు దోమల నియంత్రణకు చర్యలు చేపట్టారు. బుధవారం రాత్రి బోధన్ పట్టణంలోని పలు వార్డులలో మున్సిపల్ సిబ్బంది ఫాగింగ్ యంత్రంతో పొగ వదిలి దోమల నియంత్రణకు చర్యలు చేపట్టారు.



ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ కార్మికులు

శ్రీ సరస్వతీ విద్యామందిర్ ఉన్నత పాఠశాల నిర్మాణానికి సహకరించిన దాతకు సన్మానం



నవతెలంగాణ-కామారెడ్డి

శ్రీ సరస్వతీ విద్యామందిర్ హైస్కూల్ కామారెడ్డి పాఠశాల నూతన భవన నిర్మాణానికి సహకరించిన మాజీ మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియను శ్రీ సరస్వతీ విద్యామందిర్ హైస్కూల్ కామారెడ్డి యాజమాన్యం కమిటీ అధ్యక్షులు డాక్టర్ శ్యాంసుందర్ రావు, సంచాలన సమితి అధ్యక్షులు బొడ్డు శంకర్, కార్యదర్శి ప్రతాప్‌గౌడ్, నాగభూషణం తదితరులు ఘనంగా సన్మానించారు.

బీసీ రాజ్యాధికార సమితి కామారెడ్డి సోషల్ మీడియా సిఈఓగా బొమ్మెర స్రవంతి



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా బీసీ రాజ్యాధికార సమితి కామారెడ్డి సీఈవోగా బొమ్మెర స్రవంతిని నియమిస్తున్నట్లు న్యాయవాది, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాసరాజేశ్వర్ తెలిపారు. ఈనెల 4న హైదరాబాద్లో జరిగిన బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కమిటీ సమావేశంలో కామారెడ్డి జిల్లా నుంచి బీసీల గురించి నిర్వహించే ప్రతి కార్యక్రమంలో ఉత్సాహంగా పనిచేస్తున్న స్రవంతిని గుర్తించి ఆమెను కామారెడ్డి జిల్లా సోషల్ మీడియా సీఈఓగా నియమించినట్టు తెలిపారు.

బిజెపి నాగిరెడ్డిపేట్ మండలాధ్యక్షుడిగా శ్రీనివాస్



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ బిజెపి పార్టీ మండల అధ్యక్షుడిగా అవుసుల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా సంస్థ గత ఎన్నికల అధికారి ఎన్‌వివిఎస్-ఎస్ ప్రభాకర్ నియామకపత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. తనపై నమ్మకంతో మండలాధ్యక్షుడిగా నియమించినందుకు బిజెపి పార్టీకి శాయశక్తుల కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

బయోటెక్నాలజీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా డా.ఐలేని మహేందర్



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ బయో టెక్నాలజీ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా డా. ఐదేని మహేందర్‌ని నియమిస్తూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరి రావు గురవారం నియామకపు ఉత్తర్వులు అందించారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయ చీఫ్ వార్డెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ ఐలేని మహేందర్ గతంలో సారంగాపూర్ బిఎడ్ కళాశాల ప్రిన్సిపల్‌గా అడిషనల్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా, యూజీసీ కోఆర్డినేటర్‌గా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా విధులు నిర్వహించి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా డాక్టర్ ఐలేని మహేందర్ మాట్లాడుతూ నమ్మకంతో నియామకపు ఉత్తర్వులు అందించిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరిరావుకు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు.

రథానికి నూతన చక్రాలు అందజేత

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ రథానికి, ఏర్గట్ల గ్రామానికి చెందిన కమ్మరి రాజారపు నర్సయ్య 2 లక్షల 35 వేల రూపాయలతో నూతన చక్రాలను చేయించి గ్రామాభివృద్ధి కమిటీకి విరాళంగా అందజేశారు. వాటిని రథానికి బిగించారు. ఇందుకుగాను ఏర్గట్ల గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు నర్సయ్యకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కారుపాకల నర్సయ్య, కోశాధికారి సోమ లింగారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్రామస్తులు

ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీలో పి.పద్మకు డాక్టరేట్ ప్రధానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగం పరిశోధక విద్యార్థి పి.పద్మకు డాక్టర్ వాసం చంద్రశేఖర్ అసోసియేట్ ప్రొఫెసర్ పర్యవేక్షణలో ప్రిపరేషన్"డిజైన్ అండ్ సింథసిస్ ఆఫ్ సమ్ న్యూ మైక్రో నానో స్ట్రక్చర్ ఇనార్గానిక్ మెటీరియల్స్ ఆఫ్ ట్రాన్సిషన్ మెటల్స్ అండ్ దేర్ అప్లికేషన్స్ ఇన్ కాటలిసిస్." అనే అంశంపై పరిశోధన జరిపారు. గురువారం జరిగిన బహిరంగ మౌఖిక పరీక్షకు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్ గా కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ వి. రవీందర్ హాజరై పరిశోధన సిద్ధాంత గ్రంధాన్ని సమగ్రంగా అమూల్యాంకనం చేశారు.పరిశోధక విద్యార్థి పద్మ ఇనార్గానిక్ ట్రాన్సిసిషన్ మెటల్స్ నానో పార్టికల్స్ నీ కాటలిస్ట్ గా ఉపయోగించడం వల్ల దేశానికి జరిగే ప్రయోజనాలను ఈ సిద్ధాంత గ్రంథంలో తెలిపడం తో ప్రొఫెసర్ వి రవీందర్ సంతృప్తి వ్యక్తం చేసి పీహెచ్డీ డిగ్రీ ప్రధానానికి ఆమోదం తెలిపారు.ఈ పరిశోధన కొరకు జరిగిన ప్రయోగంలో రుజువైన ఫలితాలతో రాసిన మూడు వ్యాసాలు ప్రసిద్ధి చెందిన అంతర్జాతీయ ప్రమాణాలున్న అత్యధిక ఇంపాక్ట్ ఫ్యాక్టర్ కలిగిన జర్నల్స్ ప్రచురించడం ఈ పరిశోధనకు మరింత గుర్తింపు వస్తుందని ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్ ప్రొఫెసర్ బి రవీందర్ పరిశోధకురాలు ను అభినందించారు.ఈ బహిరంగ మౌఖిక పరీక్షకు ఫార్మసిటికల్ కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ మావురపు సత్యనారాయణ రెడ్డి , డాక్టర్ బోయపాటి శిరీష, డాక్టర్ ప్రసన్న శీల కాంటాక్ట్ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి తుకారాంజీకి విన్నపాలు



తుకారాంజీని కలిసిన జగన్‌మోహన్‌గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా నియమితులైన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్. తుకారాంజీని హైదరాబాద్‌లో గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకుని పూలగుచ్చం అందజేసి రెండు పేజీల వినతిపత్రం అందజేసినట్లు నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ తెలిపారు. సీనియర్ న్యాయమూర్తిగా తమ అనుభవంతో జిల్లాకోర్టు లోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు ఆయన వివరించారు. జిల్లాకోర్టులో ఖాళీగా ఉన్న న్యాయాధికారుల పోస్టులను భర్తీ చేయాలని, ఓల్డ్ విద్యాశాఖ కార్యాలయ స్థలాన్ని జిల్లాకోర్టు అవసరాలకు కేటాయించే విదంగా చొరవ చూపాలని కోరినట్లు జగన్ తెలిపారు. హైకోర్టు ప్రాంగణంలోనే గల అడ్వొకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డిని, అదనపు గవర్నమెంట్ ప్లీడర్ మహేష్ రాజ్‌లను మర్యాద పూర్వకంగా కలిసి నిజామాబాద్ బార్ అసోసియేషన్‌ను సందర్శించాల్సిందిగా కోరినట్లు తెలిపారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ జెడ్పీ చైర్మన్

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలో ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన పాత్రికేయుల మండల అధ్యక్షులు హిరమల లక్ష్మి నారాయణ కుటుంబాన్ని మాజీ జెడ్పీ చైర్మన్ డీ. విఠల్ రావు గురువారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ఇచ్చారు. వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ శాఖ బి ఆర్ ఎస్ అధ్యక్షులు తాజిద్దీన్, మంకేషారావు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల మాత్రల పంపిణీపై శిక్షణ

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన మెడికల్ ఆఫీసర్ రక్షిత రెడ్డి ఆధ్వర్యంలో, ఈనెల 10న నిర్వహించబోయే జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని గురించి వైద్య సిబ్బందికి,అంగన్వాడీ టీచర్లకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఒకటి నుండి 19 సంవత్సరాల వయసు గల వారికి నులిపురుగుల నివారణ కోసం ఇచ్చే ఆల్బెండజోల్ మాత్రలు ఏ విధంగా ఉపయోగపడతాయో మెడికల్ ఆఫీసర్ వివరించారు. వైద్యులు ఇందిర, మోతీరాం, విజయ, హెల్త్ అసిస్టెంట్లు పండరీ,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి వేసిన బాటలో ముందుకు నడుద్దాం

- సిపిఐఎంఎల్ మాస్‌లైన్

నవతెలంగాణ-ఆర్మూర్

కామ్రేడ్ యాదగిరి అన్న వేసిన బాటల్లో ముందుకు నడుద్దాం అని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి దేవారం అన్నారు. పట్టణ కేంద్రంలో కుమార్ నారాయణ భవన్‌లో గురువారం సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాదగిరి జిల్లాలో విప్లవోద్యమ నిర్మాణానికి మూల స్తంభంలాంటి వారని అన్నారు. అనేక మంది కార్యకర్తలను తీర్చిదిద్దారని తెలిపారు. ఆర్మూర్ డివిజన్‌లోని పెత్తందారులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రజలను కదిలించి పోరాటం చేయించారని అన్నారు. కూలీరెట్ల పెంపుదల కొరకు ఒకేసారి వందల గ్రామాలలో పిలుపునిచ్చి విజయం సాధించారని అన్నారు రెండు గ్లాసుల పద్ధతికి వ్యతిరేకంగా కుల వివక్షకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజల్ని చైతన్యం చేశారని అన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్ లైన్ సబ్ డివిజన్ కార్యదర్శి బి.కిషన్ అధ్యక్షత వహించడం, సబ్ డివిజన్ నాయకులు యం.ముత్తన్న, రాజన్న, టి.గంగాధర్, అల్గోట్ సాయిలు, ఇ.రమేష్, జి.పద్మక్క, సునీత, లక్ష్మి, ప్రజాసంఘాల నాయకులు జి.అరవింద్ , నజీర్, రవి, నాగన్న, మెహన్, రాజారాం, గంగాధర్, ప్రభాకర్, గంగాక్క, తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా నియామకమైన నందిపేట్ వాసి, న్యాయవాది నాగ సురేష్‌ను మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్ ఆధ్వర్యంలో గురువారం శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే కాలంలో పార్టీ పటిష్టత కోసం కష్టపడాలని, రాబోయే సర్పంచ్, వార్డ్ మెంబర్, ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలలో బిజెపి అభ్యర్థులు గెలిచే విధంగా కృషి చేయాలని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గంగోని సంతోష్, జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ కుమార్, పట్టణ అధ్యక్షులు మందుల బాలు, ప్రధాన కార్యదర్శి పోల్కం వేణు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు ఇబ్బందుల్లో ప్రజలు..



నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పలుచోట్ల ఏర్పాటుచేసిన ప్రభుత్వ మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా రద్దీగా ఉండే ప్రధాన కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మున్సిపల్ పరిధిలో 36 వార్డులు ఉండగా...

మున్సిపల్‌లో విలీనమైన మామిడిపల్లి, పెర్కిట్‌లను కలుపుకొని 36 వార్డులు ఉన్నవి. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా అధికారులు హుటాహుటిన మరుగు దొడ్లు నిర్మించి వదిలేశారు. సుమారుగా లక్షకుపైగా జనాభా ఉండగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరచుగా పట్టణానికి వస్తుంటారు. పట్టణంలో ప్రధాన కేంద్రాల వద్ద మరుగుదొడ్లు నిర్మించిన, మరికొన్ని చోట్ల వినియోగంలోకి లేకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని జంబి హనుమాన్ ఆవరణ, నిజాంసాగర్ కెనాల్ పక్కన, మామిడిపల్లి నిజం సాగర్ కెనాల్ తదితర ప్రాంతాలలో నిర్మించిన వాటికి సరైన అవుట్లెట్ లేకపోవడంతో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. లక్షల నిధులు నీటి పాలయ్యాయని ప్రజలు పేర్కొంటున్నారు. 16 ప్రాంతాలలో మాత్రమే మరుగుదొడ్లు వినియోగంలో ఉన్నాయి. మిగతా ప్రాంతాలలో లేకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలి..



మున్సిపల్ ప్రజా ప్రతినిధుల పాలన ముగిసిన నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రజల కోసం నిర్మించిన మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలి. అవసరమైన చోట్ల మరమ్మత్తులు చేపట్టి ప్రజల సమస్యలు తీర్చాలి.

కె.గణేష్, స్థానికుడు, పెర్కిట్..

వినియోగంలోకి తీసుకొస్తాం..



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్.

కల్తీ ఆహారంపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని న్యాల్కల్, కులాస్పూర్ అంగన్వాడి కేంద్రాల్లో కల్తీ ఆహారం పైన అంగన్వాడి సెంటర్ లోని తల్లులకు జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో ఆహార కల్తీ, అయోడిన్ ఉప్పుని ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్‌చేసే అంశంపై చైతన్య సదస్సు నిర్వహించారు. ఆహారం, కల్తీ మహమ్మారి రోజురోజుకు విజృంభిస్తున్న క్రమంలో వినియోగదారులు అందరూ చైతన్యవంతులు కావాలని ఆయన కోరారు. ఉప్పు, పప్పులు వంట నూనెను మొదలుకొని వివిధ రకాల అయోడిన్ ఉప్పు ప్లాస్టిక్ సంచులలో అమ్ముతున్నారని, కావున మైక్రో ప్లాస్టిక్ కడుపులో చేరడంతో క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. ప్లాస్టిక్ ప్యాకింగ్ వల్ల అయోడిన్ ఉప్పు లక్ష్యం వృధా అయిపోతుందని, ఉప్పు తయారీదారులు తాము ఉత్పత్తి చేసే ఉప్పును ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేయొద్దని కోరారు. ఆహార భద్రత ప్రమాణాల చట్టం 2013 నిబంధనల ప్రకారం ఆహార పదార్థాలను ఒకవేళ ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్‌చేస్తే ఆ ప్లాస్టిక్ బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్ ప్రమాణాలను ప్యాకెట్‌పై ముద్రించాలని ఆయన అన్నారు. వివిధ రకాల అయోడిన్ ఉప్పు తయారీ సంస్థలు నాసిరకం ప్లాస్టిక్ కవర్లలో ఉప్పు ప్యాకింగ్ చేయడం వల్ల చిన్న పిల్లలతో సహా అందరికి క్యాన్సర్ రావడానికి కారణం అవుతుందని తెలిపారు. అలాగే ప్యూరిఫైడ్ బియ్యం నిల్వలలో జాగ్రత్తలపై అంగన్వాడి కార్యకర్తలను చైతన్యవంతులు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు రాజుల రామనాథం ఉపాధ్యక్షుడు వీఎస్ వర్మ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, సూపర్వైజర్ జాకీరా, అంగన్వాడీ టీచర్ రజిత, బాలింతలు, గర్భిణీలు, తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియాన్ని సందర్శించిన రాష్ట్రస్థాయి కబడ్డీ ప్రతినిధులు



సన్మానం పొందిన పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

ఆదిలాబాద్ జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో భాగంగా ముగింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ బృందం ప్రతినిధులు మండల కేంద్రంలోని "భూదేవ్ ఇండోర్ స్టేడియం"ను సందర్శించారు.. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి, రాష్ట్ర మాజీ ఒలింపిక్ కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీష్ యాదవ్, రాష్ట్ర కబడ్డీ కోచ్ శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ట్రెజరర్ రవి, కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి మల్లేశం, రాజన్న సిరిసిల్ల జిల్లా సెక్రటరీ మల్లారెడ్డి, కోచ్ జ్యోతిశ్వర్, రంగారెడ్డి జిల్లా సెక్రటరీ రవీందర్, సీనియర్ జాతీయ కబడ్డీ క్రీడాకారులు సతీష్ గురువారం సందర్శించారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు అంద్యాల లింగయ్య, ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డి తెలిపారు. అంతకుముందు జాతీయ కబడ్డీ సీనియర్ క్రీడాకారుడు, నిజామాబాద్ జిల్లా కబడ్డీ సంఘ కోచ్‌గా వ్యవహరించిన ఈగ లింబారెడ్డి (రిటైర్డ్ సబ్ ఇన్స్పెక్టర్) "మాతృమూర్తి" బుధవారం చనిపోయిన . విషయం తెలుసుకున్న ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఇండోర్ స్టేడియంను సందర్శించిన వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రవణ్ రెడ్డి, పిడి రాజ్ కుమార్, ఊషఊ రాష్ట్ర క్రీడా అధ్యక్షులు ఏలేటి గంగాధర్, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు నునుగొండ అంజయ్య, కనకయ్య గౌడ్, మోతె గంగారెడ్డి, చిట్కా దినేష్, సాయిలు, అరిఫ్, హరీష్, చైతన్య యువజన సంఘం నాయకులు పల్లికొండ గోపీనాథ్, టి.సాయన్న, కొమ్ముల నర్సయ్య, గద్దల గంగారాం, బుస్సాపూర్ గంగారెడ్డి, కొండజి శ్రీను, ఏట్టెం మహేష్ యాదవ్, ధనుష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివించాలి

- మహిళా శిశుసంక్షేమ శాఖ జిల్లా అధికారి షేక్ రసూల్‌బి



మాట్లాడుతున్న మహిళా శిశుసంక్షేమ శాఖ జిల్లా అధికారి

నవతెలంగాణ-బాల్కొండ

లింగ వివక్ష చూపకుండా ఆడపిల్లలను చదివించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిని షేక్ రసూల్ బి అన్నారు. మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో బేటి బచావో బేటి పడావో పథకంపై, పిల్లల చట్టాలపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భ్రూణ హత్యలు తగ్గించి బాలికల లింగ నిష్పత్తిని పెంచేందుకు, ముఖ్యంగా ఆడపిల్లలను చదివించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. లింగ వివక్ష చూపకుండా ఆడపిల్లను చదివించి ఆడపిల్లల అభ్యున్నతికి, వారి భవిష్యత్తుకు పాటుపడాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, ఎమ్మార్వో శ్రీధర్, ఏపీఓ ఇందిరా, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, సిడిపిఓ భార్గవి, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

విప్లవ సాంస్కృతికోద్యమం నిర్మాణానికి పూనుకుందాం

- ఐఎఫ్‌టీయు నిజామాబాద్ జిల్లా నాయకులు దాసు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

విప్లవ సంస్కృతికోద్యమం నిర్మాణానికి పూనుకుందామని ఐఎఫ్‌టీయు నిజామాబాద్ జిల్లా నాయకులు దాసు అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పాత వ్యవసాయ మార్కెట్ నుండి శంకర్ విలాస్ మీదగా కొత్త బస్ స్టాప్ నుండి ర్యాలీగా తిరుమల గ్రౌండ్‌క చేరుకొని అరుణోదయ జెండా అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు పి నాగన్న ఆవిష్కరించారని తెలిపార. అనంతరం విలీన సభ రాష్ట్ర అధ్యక్షులు వేణు అధ్యక్షతన నిర్వహించగా ప్రారంభ ఉపన్యాసంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి కోటేశ్వరరావు, విప్లవ సంస్కృతిక ఉద్యమాన్ని మరింతగా తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారని అన్నార. ప్రాణాలను అరుణోదయ కోసం అర్పించిన కానూరి వెంకటేశ్వరరావు, అరుణోదయ రామారావు, వై వెంకన్నలు చూపిన బాటలో ముందుకు కొనసాగాలని కోరారని తెలిపారు. దేశంలో పెను ప్రమాదంగా ముందుకొస్తున్న కాషాయికరణకు, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారని చెప్పారన్నారు. ఈ విలీన సభలో ముఖ్యవక్త యోచన మాట్లాడుతూ.. తుపాకి తూట ఎంత బలమైనదో కళాకారుడు చేతిలోని డప్పు, కాలి గజ్జలు అంత బలమైనవి గుర్తించాలని చెప్పారని తెలిపారు. ఈ విలీన సభలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే గోవర్ధన్, ఆవునూరి మధు, సూర్యాపేట జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, రాయి కృష్ణ,డాక్టర్ రంగారెడ్డి, ధర్మార్జున్ చిన్ని, భద్రయ్యలు రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీశైలం, జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోటు లక్ష్మయ్య, బొడ్డు శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, నర్సింహా రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలేబోయిన కిరణ్, కంచనపల్లి సైదులు, జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి, డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్, రాష్ట్ర నాయకులు బండి రవి, ప్రవీణ్, సామా నర్సి రెడ్డి, రమేష్, ప్రవీణ్, సంజీవ్ రెడ్డి మెబెల్లి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన



వినతిపత్రాన్ని అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

చిన్నారులపై కుక్కల దాడి విషయమై బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి కమిషనర్ రాజుకు డిమాండ్‌తో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు మందుల బాలు, మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, జిల్లా కిసాన్ నాయకులు నూతల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలోని యోగేశ్వర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ లో కుక్కలు స్వైర విహారంచేస్తూ చిన్నారులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయన్నారు. నిజామాబాద్‌లో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఇది ముమ్మాటికి గత పాలకుల నిర్లక్ష్యం, అధికారుల నిర్లక్ష్యం అని అన్నారు. పొద్దుటూరు వినయ్ రెడ్డి ప్రజలను గాలికి వదిలేసి మున్సిపల్ అధికారులతో అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు చిన్న పిల్లలు కుక్కల దాడిలో గాయపడుతున్న ఇంతవరకు స్పందించడం లేదని, మున్సిపాలిటీకి ఇంచార్జ్ అధికారి, మున్సిపల్ కమిషనర్‌గ బాధ్యత వహించి వెంటనే వారికి చికిత్సకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ వెంటనే దీనిపై చర్యలు తీసుకొని కుక్కల, కోతుల, దోమల బెడదను నివారించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి జస్సు అనిల్, మాజీ కౌన్సిలర్ బ్యావత్ సాయి, విజయ్ ఆనంద్, జాకీర్దార్ శీను, పాన్ శీను, గుగులోత్ తిరుపతి నాయక్,ఆరే రాజేశ్వర్,దొండి ప్రకాష్, ఉదయ్, కందేశ్ ప్రశాంత్, అనిల్, మనీ, మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ మద్దతు తెలపకపోవడం దురదృష్టకరం

- కాంగ్రెస్ పార్టీ ఇందల్ వాయి మండల అధ్యక్షులు మోత్కూరి నవీన్‌గౌడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎస్సీ వర్గీకరణకు బిఆర్ఎస్ మద్దతు తెలపకుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని అక్కసుతో వాక్ అవుట్ చేయడం దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ ఇందల్ వాయి మండల అధ్యక్షులు మోత్కూరి నవీన్ గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ దళితులకు సంబంధించి రాబోయే కాలంలో ఆర్థిక, సామాజిక, విద్యా, రాజకీయపరంగా ఏం చేస్తే బాగుంటుందో కేటిఆర్ ఆలోచిస్తారని బావిస్తున్నామని, కానీ ఇలా చేస్తారని అనుకోవడంలేదని అన్నారు. పేద ప్రజలు బాగుపడం ఇష్టం లేకనే శాసనసభను బీఆర్ఎస్ బహిష్కరించిందని ఎద్దేవా చేశారు.ఎస్సీ వర్గీకరణతో పాటు కీలకమైన బిసి కులగణనపై చర్చ జరుగుతుంటే సభకు రండి అని ముఖ్యమంత్రి చెప్పిన కేసిఆర్ రాకపోవడం దురదృష్టకరం అని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి దళిత ముఖ్యమంత్రి చేస్తానని, బీసిలకు బిసి బంధు అమలు చేస్తానని రకరకాలుగా మోసం చేశారని తెలిపారు. రాహుల్గాంధీ, సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కులగణన చేయడమే కాకుండా ఎస్సీ వర్గీకరణకు కూడా కాంగ్రెస్ పార్టీ స్వాగతం చెప్పిందని, అందుకు పూర్తి మంత్రివర్గానికి యావత్ రాష్ట్రం అభినందనలు తెలుపుతుందని వివరించారు.

పలు బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సునీల్‌కుమార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో పలు బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ గురువారం పరామర్శించారు. మండల కేంద్రంలోని గాంధీనగర్ కు చెందిన రవి ఇటీవల ప్రమాదవశాత్తు చెట్టు పై నుండి పడి రెండు కాళ్లు విరిగాయి. వారి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి వైద్య ఖర్చుల కొరకు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. మండలంలోని హాసకొత్తూర్ గ్రామానికి చెందిన ఏనుగు భూమన్న ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగడ సానుభూతిని వ్యక్తం చేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, కిషన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగేల ప్రవీణ్, నాయకులు వేముల గంగారెడ్డి, నిమ్మ రాజేంద్రప్రసాద్, తక్కురి దేవేందర్, కొమ్ముల రవీందర్, బోనగిరి లక్ష్మణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని రెంజర్ల, నాగంపేట్ గ్రామాల్లో గురువారం మండల అధికారులు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థాగత ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వచ్చే వేసవికాలంలో ముందస్తు చర్యల్లో భాగంగా నీటి సరఫరాపై అధ్యయనం చేశారు. అనంతరం ఆయా ప్రభుత్వ పాఠశాలలను విజిట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్ ఆనంద్, ఎంపీవో గౌస్ మోహినోద్దీన్, ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు గౌతమి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా నాగరాజు నియామకం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ గా డా. ధరావత్ నాగరాజు ను నియమిస్తూ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ టి యాదగిరి రావు నియామకపు ఉత్తర్వులను గురువారం అందించారు.ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ నా మీద నమ్మకంతో నియామకపు ఉత్తర్వులు అందించిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరిరావుకు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు.

లారీ, ఆటో ఢీ.. ఇద్దరు యువకులు మృతి

నవతెలంగాణ-మాక్లూర్

నిజామాబాద్ రూరల్ శ్రీనగర్ వద్ద లారీ ఆటో ఢీ కొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన ఇంతీయస్(22), ఎస్కె ఫరన్ (24) వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తూ ఉంటారు. పనులు ముగించుకొని ఇంటికి తిరుగు ప్రయాణంలో నిజామాబాద్ రూరల్ శ్రీనగర్ వద్ద లారీ ఢీ కొనడంతో ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతదేహాలను జిల్లా కేంద్ర ఆస్పత్రి తరలించామన్నారు. మృతుల కుటుంబం వద్ద గ్రామస్తులు, కుటుంబీకులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.


ఘటనా స్థలంలో యువకుని మృతదేహం

బైక్ చోరీ.. నిందితుడి అరెస్ట్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పడకల్ గ్రామంలో బైక్ చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్టు ఎస్క్మై తిరుపతి తెలిపారు. ఈనెల 5న పడకల్ గ్రామానికి చెందిన మేకల సాయన్న గ్లామర్ మోటార్ సైకిల్ ని గుర్తు తెలియని దొంగలు గ్రామంలోని తన పశువుల పాక వద్ద నుండి దొంగిలించారని పిర్యాదు చేశారు. కేసు పరిశోదనలో బాగంగా డిచ్ పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూచనల మేరకు ఈనెల 6న ఉదయం 11 గంటలకు మనోహరాబాద్ వద్ద వాహనాలు తనికి చేస్తుండగా ఒక వ్యక్తి బైక్‌పై అనుమనాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపు లోకి తీసుకుని విచారించారు. నిర్మల్ జిల్లా నిర్మల్ మండలం భాగ్యనరగ్‌కు చెందిన ముప్కాల రాకేశ్ దొంగతనం ఒప్పుకున్నాడని, నిందితుడి వద్ద నుండి బైక్ స్వాదీన పరుచుకుని కోర్టు లో హాజరు పరిచినట్టు ఎస్సై తిరుపతి తెలిపారు.

ప్రత్యేక ఎంపీటీసీ స్థానాన్ని కల్పించాలి

- కలెక్టరేట్‌లో దోతీ, మల్లాపూర్, మారేపల్లి గ్రామస్తుల వినతి

నవతెలంగాణ-మద్నూర్

దోతీ, మల్లాపూర్, మారేపల్లి గ్రామాలకు కలిపి ప్రత్యేక ఎంపీటీసీ స్థానాన్ని కల్పించాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజలు కలెక్టరేట్‌లో వినతిపత్రాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 'ఉమ్మడి మండలంలోని డోంగ్లి మండలాన్ని ప్రత్యేక మండలంగా గుర్తిస్తూ ఎంపిటిసి స్థానాలను కేటాయించింది. ఈ మండలానికి ఐదు ఎంపిటిసి స్థానాలు కేటాయించగా గత ఉమ్మడి మండలంలో గల ధోతి, మారేపల్లి, మల్లాపూర్ ఈ మూడు పంచాయతీలు సుల్తాన్‌పేట్ ఎంపిటిసి స్థానంలో ఉండేవి. సుల్తాన్‌పేట్ గ్రామం మద్నూర్ మండలంలో ఉండడం ఎంపిటిసి స్థానాలు మారాయి. మూడు గ్రామపంచాయతీలను డోంగ్లి మండలంలోని మోగా ఎంపిటిసి స్థానంలో కలిపింది. ఈ మూడు పంచాయతీల పరిధిలో నాలుగు గ్రామాలు ఉన్నాయి. ఓటర్ల సంఖ్య 3141.' అని తెలిపారు. మూడు పంచాయతీలు నాలుగు గ్రామాలను కలిపి ఒక ప్రత్యేక ఎంపీటీసీగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆ మూడు గ్రామ పంచాయతీల పరిధిలోని మాజీ సర్పంచులు పార్టీల ముఖ్య నాయకులు గురువారం కామారెడ్డి కలెక్టరేట్ తరలివెళ్లి జిల్లా కలెక్టర్‌కు జిల్లా పరిషత్ సీఈఓకు వినతి పత్రాలు అందజేశారు. మోగా గ్రామం చాలా పెద్దదని, ఈ మూడు పంచాయతీలు వాటిలో కలపడం 5 వేలకు పైగా ఓటర్లతో ఎంపీటీసీ స్థానం అతిపెద్దగా కావడమే కాకుండా ధోతి, మల్లాపూర్, మారేపల్లి గ్రామపంచాయతీలకు దూరప్రాంతంగా అవుతుందని ప్రభుత్వం పునరాలోచించి తమ మూడు గ్రామ పంచాయతీలను కలిపి ప్రత్యేక ఎంపీటీసీ స్థానాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

8వ ఫెడరేషన్ కప్‌బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్‌కు శశిధర్ ఎంపిక

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

కర్ణాటకలో 8వ ఫెడరేషన్ కప్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్‌కు తెలంగాణ పురుషుల జట్టులో నిజామాబాద్ జిల్లా క్రీడాకారుడు శశిధర్ ఎంపికయ్యార. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లాలో ఈనెల 7 నుండి 10 వరకు జరిగే 70వ పురుషుల జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ టోర్నమెంట్ కోసం ఎంపికైన తెలంగాణ పురుషుల జట్టుకు తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో సన్నద్ధత శిబిరాన్ని ఈనెల 1వ నుండి 6 వరకు ఏఎస్ రావు నగర్ మారుతి బాల్ బ్యాట్మెంటన్ గ్రౌండ్స్‌లో నిర్వహించారు. గురువారం తుది జట్టును ఎంపిక చేశారు. తుది జట్టులో నిజామాబాద్ జిల్లా సీనియర్ క్రీడాకారుడు శశిధర్ ఎంపికయ్యారు. శశిధర్ ఎంపిక పట్ల తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి వివి రమణ, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్, ఉపాధ్యక్షులు కిషోర్, కిషన్, రంజిత్ నరసయ్య, రాజ్ కుమార్, వ్యాయమా ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి,మల్లేష్ గౌడ్, కోశాధికారి రాజేశ్వర్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అడల్ట్, డివార్మింగ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

- డాక్టర్ రోహిత్ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి రోహిత్ కుమార్

నవతెలంగాణ-పిట్లం

మండలంలో 10న నిర్వహించే అడల్ట్ బీసీజీ, నేషనల్ డివార్మింగ్ ప్రోగ్రాంను విజయవంతం చేయాలని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రోహిత్ కుమార్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్, నేషనల్ డివార్మింగ్ ప్రోగ్రాంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రోహిత్ కుమార్ మాట్లాడుతూ.. అల్బెండోజోల్ మాత్రలు రెండు సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర రెండు నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర చొప్పున అందించాలని సూచించారు. మూడు నుంచి 19 సంవత్సరాల కౌమార పిల్లలకు మధ్యాహ్నం అన్నం తిన్న తర్వాత ఒక మాత్ర అందించాలన్నారు. ఇట్టి మాత్రల వలన పిల్లల కడుపులో ఉన్న నులిపురుగులు క్షీణిస్తాయని సూచించారు. అడల్ట్ బిసిజి నేషనల్ డివార్మింగ్ ప్రోగ్రాంను విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్‌హెచ్‌ఈఓ భూమయ్య, పబ్లిక్ హెల్త్‌నర్స్ అన్వరి బేగం, సూపర్‌వైజర్‌లు యశోద, శాంతి శ్రీ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ షహనాజ్ బేగం, హెల్ అసిస్టెంట్‌లు విజయ్ కుమార్, శ్యామ్‌రావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

మాల వాడల నుంచి కాంగ్రెస్‌ను తరమండి

- ఆంసా రాష్ట్ర అధ్యక్షుడు అంగరి ప్రదీప్
- కేంద్ర మంత్రి, సిఎం దిష్టి బొమ్మలు దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మాల వాడల నుంచి కాంగ్రెస్‌ను తరమండని ఆంసా రాష్ట్ర అధ్యక్షుడు అంగరి ప్రదీప్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ మంత్రి మండలి ఆమోదం తెలపడాన్ని, అసెంబ్లీలో శమిమ్ అక్తర్ కమిటీ నివేదికను ప్రవేశ పెట్టడాన్ని నిరసిస్తూ నిజామాబాద్ జిల్లాలోని మాల సంఘాల జేఏసి ఆధ్వర్యంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మలు గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఆరు శాతం మాలలకు రిజర్వేషన్ ఉంటే ఇప్పుడు దానిని 5 శాతానికి తగ్గించడం పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అలాగే మోడీ కనుసన్నల్లో పని చేస్తున్న కాంగ్రెస్ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఉప వర్గీకరణను చేస్తున్నారని తెలిపారు. మాలల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్న ముఖ్యమంత్రి తీరును నిరసిస్తూ రాబోయే ఎమ్మెల్సీ ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పని చేసి కాంగ్రెస్ ఓటమి కోసం మాలలు పని చేయాలని కోరారు. మాల జాతి ద్వారా రాజకీయం చేస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో నోరు విప్పక పోవడ్డాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షులు ఎల్లము మాట్లాడుతూ.. మాలలు వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో అలుక కిషన్, దేవదాస్, ఉదయ్, నాగరాజు, స్వామిదాస్, ఎల్లం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో వీఆర్ఏ వారసుల నిరసన

నవతెలంగాణ-నవీపేట్/మాక్లూర్

మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో వీఆర్ఏ వారసులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబర్ 81, 85 ప్రకారం ప్రభుత్వం ఉద్యోగ పత్రాలు ఇవ్వడం లేదని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ హైదరాబాద్ లోని ఇంటి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సందర్భంగా అక్రమ అరెస్టులకు పాల్పడడం పట్ల నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. వెంటనే అరెస్టు చేసిన వారిని విడుద చేయాలని తమ న్యాయమైన పోరాటానికి స్పందించి వెంటనే నియామక పత్రాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సయ్య, సుధాకర్, జ్యోతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.


నవీపేట్ : నిరసన తెలుపుతున్న వీఆర్ఏ వారసులు


మాక్లూర్‌లో..

మాక్లూర్ :మండలంకేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు మండల విఆర్ఎలు గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 4న వీఆర్ఏలను అక్రమంగా అరెస్టు చేసినందుకు ఈ నిరసన కార్యక్రమం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు అసది భాస్కర్, జనరల్ సెక్రటరీ బేగరి ముత్తన్న, విఆర్ఏలు కమలాకర్ వినేష్, నరేష్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో 50శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టాలి

- జిల్లా నాయకులు చక్రపాణి

నవతెలంగాణ-కంఠేశ్వర్

దేశ జనగణనలో కులగనగార్వాలని, ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీలకు 50 శాతం చట్టసభల్లో రిజర్వేషన్ బిల్లు పెట్టి అమలు చేయాలని జిల్లా నాయకులు చక్రపాణి అన్నారు. గురువారం బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ రవి కిరణ్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, రెండు లక్షల కోట్లతో బీసీ సంక్షేమ అభివృద్ధి కొరకు బడ్జెట్లో నిధులు కేటాయించాలని తెలిపారు. కార్యక్రమంలో రాధా కుమార్, రమేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

ఏబిసిడి వర్గీకరణ అమలుపై అసెంబ్లీలో తనదైనశైలిలో మొట్టమొదటి సరిగా తమ గళాన్ని వినిపించి దేశంలోని మాదిగ జాతి గర్వించేలా వర్గీకరణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో అమలు చేసిన సందర్భంగా హైదరాబాద్‌లోని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు స్వగహంలో మర్యాద పూర్వకంగా కలిసి గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అయిల్వార్ రమేష్, మాజీ మద్నూర్ సొసైటీ చైర్మన్ కొండ గంగాధర్, సీనియర్ జర్నలిస్ట్ జాదవ్ వీరన్న, ఎంఆర్‌పిఎస్ నాయకుడు ఇబత్వర్ తూకరం, బిచ్కుంద మండల మైనార్టీ అధ్యక్షుడు ఖలీల్‌భాయ్, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున సెల్‌ఫోన్లు అందజేత

నవతెలంగాణ -ధర్పల్లి

మండలకేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు వివిధ కారణాలచేత తమ సెల్ ఫోన్లను పోగొట్టు కున్న సన్దబంగా ,వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి అట్టి ఫోన్లను స్వాధీన పరుచుకొని గురువారము వారిద్దరిని రెండు ఫోన్లు ఎస్ఐ రామకృష్ణ అప్పగించడం జరిగింది .



మహిళల్లో ఆరోగ్య సమస్యలపై అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నందు రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.చంద్రిక గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ వసంతకుమారి పాల్గొని మహిళల్లో వచ్చే వివిధ రకాల అనారోగ్య సమస్యలతో పాటు, స్త్రీలలో వచ్చే ఋతు సంబంధ అనారోగ్య సమస్యలు, అధిక రక్తస్రావం వల్ల కలిగే అనర్థాలు, మహిళల్లో గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ సమస్యల గురించి అవగాహన కల్పించారు. దంత వైద్యులు డాక్టర్ హనుమంత్‌రెడ్డి, డాక్టర్ ప్రణతిలు పాల్గొని విద్యార్థులకు దంత సంబంధ సమస్యల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులకు కళాశాల ప్రిన్సిపల్ సన్మానం చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆర్మూర్ వారికి, వైద్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుజాత, కళాశాల హెల్త్ సూపర్‌వైజర్ సంతోషి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చైతన్య శాంతి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

లాభాల బాటలో దూపల్లి సహకార సంఘం

- సొసైటీ చైర్మన్ శేషు గారి భూమారెడ్డి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గ సభ్యులు, రైతుల సహకారంతో లాభాల బాటలో నడుస్తోందని సొసైటీ చైర్మన్ శేషు గారి భూమారెడ్డి స్పష్టం చేశారు. గురువారం సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకవర్గ సభ్యులు, రైతుల సహకారంతో బ్యాంకు బ్యాలెన్స్ రూ.25లక్షల వరకు జమ చేయబడిందని ఆయన పేర్కొన్నారు. పాలకవర్గ సభ్యుల సహకారంతో ప్రధాన రోడ్డు పక్కన 6 గుంటల స్థలాన్ని కార్యాలయం కోసం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. సొసైటీ నిధులతో అదనపు గిడ్డంగిని నిర్మించామన్నారు. సొసైటీ నష్టాల్లో నుంచి లాభాల్లోకి తీసుకురావడానికి సంఘం సభ్యులు సహకరించాలని తెలిపారు. సొసైటీ లాభాలలోకి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ఆయన కతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పల్లె సాయిలు, ధనుర్ గంగాధర్, కోనేపల్లి రాజారెడ్డి, జి.ప్రతాపరెడ్డి, నీరడి రవికుమార్, మైని రాజ్ కుమార్, శ్రీమతి ముళ్లపూడి వరలక్ష్మి, సొసైటీ సీఈవో జీవన్ రెడ్డి, సేల్స్ మెన్ఎల్. సాయన్న, సి.ప్రతాపరెడ్డి, అటెండర్ వై.లక్ష్మణ్, రైతులు గంగారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు బాబన్న, ఎర్ర సాయన్న, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ భూమారెడ్డి

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందాడని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయి రెడ్డి గురువారం తెలిపారు. రైల్వే ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం 08 గంటలకు నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ అయిన హరి కృష్ణ ఇచ్చిన సమాచారం ప్రకారం ఒక గుర్తు తెలియని పురుషుడు (25-30) ఆర్సపల్లి రైల్వే గేటు దగ్గరలోని నిజామాబాద్-జానకంపేట్ రైల్వే స్టేషన్ మధ్య రైలు నుంచి కింద పడి పట్టాల పక్కన మృతి చెందాండు. మృతుడిని గుర్తించుటకు ఎటువంటి ఆధారాలు దొరకలేదని తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని శవాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. మృతుడిని గుర్తిస్తే నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ 8712658591 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

దుబాయ్‌లో గుండె పోటుతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-భీంగల్ రూరల్



మండలంలోని పురాణిపేట్ గ్రామానికి చెందిన తోట జడల రాజేశ్వర్ (50) గుండె పోటుతో మృతి చెందాడు. ఉపాధి నిమిత్తం ఎడారి దేశానికి వెళ్లిన రాజేశ్వర్ జనవరి 29న మృతిచెందాడు. నిరుపేద రైతు కుటుంబానికి చెందిన మృతుడు జనవరి 16 ఎడారి దేశానికి ఉపాధి నిమిత్తం తిరిగి వెళ్ళాడు. వెళ్లిన 13 రోజులకే గుండెపోటు వచ్చింది. వెంటనే తోటి కార్మికులు అంబులెన్సు లో ఆసుపత్రి కి తరలించారు. ఆసుపత్రి కి చేరుకునే లోపు రాజేశ్వర్ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. మృత దేహాన్ని తీసుకుని స్వదేశానికి వచ్చేందుకు బంధువులు ఏర్పాటు చేస్తున్నారు. నేడు మృత దేహం వచ్చే అవకాశం ఉంది. రాజేశ్వర్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుని స్వగ్రామం పురానిపేట్ అయినప్పటికీ బతుకు దెరువు కొరకు కుటుంబంతో నివసిస్తున్న వేల్పూర్ మండలం కుకునూర్ లో అంత్యక్రియలు జరిగే అవకాశం ఉంది.

అబ్దుల్ కలాం ఆశయాలను ప్రతిబింబించారు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ట్రస్మా, ఉమెన్ కాలేజ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ కార్యక్రమం గురువారం ఘనంగా ప్రారంభమైంది. అబ్దుల్ కలాం ఆశయాలను ప్రతిబిం బిస్తూ ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శనలో మిస్సైల్స్, సాటిలైట్స్, చంద్రయాన్, ఆర్యభట్ట తదితర ఉపగ్రహాల తదితర నమూనాలను ఉమెన్స్ కాలేజీ గ్రౌండ్లో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకి సుమారుగా 5000 మంది విద్యార్థులు హాజరై తిలకింకిచారు. ఈ కార్యక్రమం ప్రారంభిస్తూ ఉమెన్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు పి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పిల్లలలో పెంచే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఎంతో ఉపయోగకరంగా ఉందని, విద్యార్థులు చాలా ఆసక్తిగా గమనించారని, ప్రదర్శనలో పాల్గొన్న విమెన్స్ కాలేజీ విద్యార్థులు చక్కగా ప్రతి ఐటమ్‌ని వివరంగా తెలియజేయడం బాగుందని అన్నారు. ట్రస్మా అధ్యక్షులు నిత్యానందం మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో మొట్టమొదటిసారిగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం మాకు గర్వకారణంగా ఉందని, ఇలాంటి కార్యక్రమాలు మండలాల్లో కూడా ఏర్పాటు చేస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తామని దానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉమెన్స్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ పద్మనాభరెడ్డి, కమిటీ మెంబర్లు సరళ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొనగా ట్రస్మా కార్యదర్శి గోజూరి అరుణ్, పట్టణ అధ్యక్షులు ధర్మరాజు, కార్యదర్శి శ్రీనివాస్ కోశాధికారి నాగరాజు రాష్ట్ర సలహాదారులు మోహన్, కళాశాల అధ్యాపకులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శనను తిలకిస్తున్న పలువురు


ఉపగ్రహ నమూనాల ప్రదర్శన



ప్రదర్శన ఏర్పాటు చేసిన విద్యార్థి